# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 279 | హైదరాబాద్ | శుక్రవారం 01-05-2026 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు వర్ష సూచన

## మే 1 నుంచి మారనున్న
# కీలక నిబంధనలు

- ఎల్‌పీజీ సిలిండర్ ధరలు, బుకింగ్, డెలివరీ నిబంధనల్లో కీలక మార్పులు
- ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై పెరగనున్న లేట్ పేమెంట్ ఫీజులు.. మారనున్న ఫీజు మినహాయింపు రూల్స్
- ఆన్‌లైన్ గేమింగ్ కోసం కఠినమైన కొత్త చట్టం, ప్రత్యేక అథారిటీ ఏర్పాటు
- సీఎన్‌జీ-పీఎన్‌జీ ధరల సవరణకు అవకాశం 11లో






## సీఎం రేవంత్ రెడ్డితో
# డీజీపీ సీవీ ఆనంద్ భేటీ

- కొత్త డీజీపీగా బాధ్యతలను స్వీకరించిన సీవీ ఆనంద్
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీ
- శాంతిభద్రతలను కాపాడటంలో రాజీ పడకుండా పనిచేస్తానని సీఎంకు హామీ 11లో





## అమెరికా సైన్యానికి
# ఇరాన్ హ్యాకర్ల షాక్!


- ఇరాన్‌తో సంబంధాలున్న హండాలా అనే సైబర్ గ్రూప్ దాడి
- పర్షియన్ గల్ఫ్‌లోని 2,379 మంది యూఎస్ మెరైన్స్ డేటా లీక్
- సైనికుల వాట్సాప్‌కు బెదిరింపు సందేశాలు పంపిన హ్యాకర్లు
- ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన అమెరికా రక్షణ శాఖ పెంటగాన్
- గతంలో ఎఫ్‌బీఐ డైరెక్టర్ ఈమెయిల్‌ను హ్యాక్ చేసిన ఇదే గ్రూప్ 11లో

## అమెరికాతో పాకిస్థాన్ డబుల్ గేమ్?.
# ఇరాన్‌కు అండగా కీలక నిర్ణయం!

- అమెరికా, ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్
- ఇరాన్‌తో వాణిజ్యం కోసం ఆరు భూమార్గాలను తెరిచిన పాక్
- ట్రంప్ 'గరిష్ఠ ఒత్తిడి' వ్యూహాన్ని దెబ్బతీసే చర్యగా విమర్శలు
- పాక్ డబుల్ గేమ్ ఆడుతోందన్న అమెరికా భద్రతా నిపుణులు
- పాక్ విశ్వసనీయతపై ఇజ్రాయెల్, ఇరాన్‌ల నుంచి కూడా సందేహాలు

11లో








## మోదీ టూర్ అప్‌డేట్స్
# కిషన్ రెడ్డి కీలక ప్రకటన

- మే 10న హైదరాబాద్ వస్తున్న ప్రధాని మోదీ
- రాష్ట్రంలో రూ.7,823 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారన్న కిషన్ రెడ్డి
- రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడి 11లో

## మైక్రోఫైనాన్స్ కేసులో సంచలనం..
# మంగ్లీ సోదరుడి ఖాతాకు డబ్బులు!

- శివచౌహాన్ ఖాతాలను పరిశీలించగా మూడుసార్లు డబ్బులు వచ్చినట్లు గుర్తింపు
- రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు వచ్చినట్లు గుర్తింపు
- నిందితుల బ్యాంకు ఖాతా వివరాలను కోరుతూ పోలీసుల లేఖ

11లో






## తెలుగు అకాడమీ విభజన
# మా వాటా మాకు ఇవ్వండి!

11లో

- ఏపీ వాటా నిధులు విడుదల చేయాలని తెలంగాణను డిమాండ్ చేసిన తెలుగు అకాడమీ
- సుప్రీంకోర్టు ఆదేశించినా తెలంగాణ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని ఆరోపణ
- నిధుల కొరతతో అకాడమీ కార్యకలాపాలకు తీవ్ర ఇబ్బందులున్నాయన్న ఛైర్మన్ విల్సన్
- ఇంటర్ పుస్తకాల బకాయిలు రూ.50 కోట్లు కూడా రావాల్సి ఉందని వెల్లడి
- అకాడమీ ఛైర్మన్‌కు కేబినెట్ హోదా ఇవ్వాలని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి



## 'టీఆర్ఎస్' నాకు 11లో
# రాసిపెట్టి ఉందేమో: కవిత

- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)కు ఈసీ ఆమోదం
- టీఆర్ఎస్‌కు ఆమోదం లభించడం సంతోషంగా ఉందన్న కవిత
- తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తానని ట్వీట్

భారత శక్తి

# ఏపీకి 11,056 కోట్లు..
# ఇదీ బాబు మార్క్ పరిపాలన.. సంపద..

విజయవాడ, ఏప్రిల్ 30,

ఒక ఎకో సిస్టం డెవలప్ కావాలంటే అక్కడ అనుకూల పరిస్థితులు సృష్టించాలి. అవి సృష్టించాలంటే అక్కడి నాయకత్వానికి దూర దృష్టి ఉండాలి. అలాంటి దూర దృష్టి ఉన్న నాయకుడు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయగలడు. దానికోసం అవకాశాలను సృష్టించగలడు. అంతిమంగా ఆ ప్రాంతాలను గొప్పగా వృద్ధి చేయించగలడు. అలాంటి నాయకుడే ఇప్పుడు ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన దార్శనికత వల్ల ఏపీ కథ మొత్తం మారిపోయింది.ఏ ప్రభుత్వానికైనా ఆదాయం అత్యంత అవసరం. ఎందుకంటే ఆదాయం ఉంటేనే అభివృద్ధి పనులు చేయడానికి సాధ్యమవుతుంది. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వీలవుతుంది. ఆదాయం రావాలంటే ప్రజల్లో నమ్మకం పెరగాలి. కొనుగోలు శక్తి పెరగాలి. అప్పుడే ఆర్థిక వృద్ధి.. అభివృద్ధి సాధ్యమవుతుంది.. ఏపీ రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.. ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు ఏపీ రాష్ట్రంలో అభివృద్ధి అంతంత మాత్రమే ఉండేది. అప్పులు మాత్రం దారుణంగా ఉండేది. ఈ క్రమంలో నాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తన అనుభవాన్ని మొత్తం రంగరించారు. ఫలితంగా ఏపీ రాష్ట్ర అభివృద్ధి బాట పట్టింది.ఏపీ రాష్ట్రానికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయాన్ని పరిశీలనకు తీసుకుంటే.. గత ఆర్థిక సంవత్సరం అద్భుతమైన వృద్ధి కనిపించింది. అంతకుముందు ఏడాదితో పోల్చి చూస్తే ఇది ఏకంగా 25% ఎక్కువ. బడ్జెట్ అంచనాలను దాదాపు 98.4% సాధించింది. 2024-2025లో 8, 847 కోట్లుగా ఉన్న ఆదాయం.. 2025-26 లో 11,056 కోట్లకు చేరుకుంది. డిజిటల్ విధానం, పరిపాలన సంస్కరణల వల్ల రిజిస్ట్రేషన్ల ఆదాయంలో పెరుగుదల కనిపించింది.. ఈ స్థాయిలో ఆదాయం సాధించడం అంటే మామూలు విషయం కాదు.. పైగా ఇంతటి వృద్ధి అన్ని రకాల వసతులు ఉన్న రాష్ట్రాల్లో కూడా సాధ్యం కాలేదు. కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టడం.. రాజధాని నగరంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతూ ఉండడం.. ప్రభుత్వపరంగా సానుకూల నిర్ణయాలు కనిపిస్తూ ఉండడంతో.. ఏపీ రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం అమాంతం దూసుకుపోయింది.. ఇదే జోరు గనుక కొనసాగితే వచ్చే రోజుల్లో కూడా ఆదాయం మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు"ఆంధ్రప్రదేశ్లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఒకప్పటి మాదిరిగా ఒత్తిడి లేదు. అన్ని అనుమతులు త్వరగానే వస్తున్నాయి. భూమి కేటాయింపులు కూడా జరిగిపోతున్నాయి.. ప్రభుత్వం రంగంలోకి దిగి అన్ని రకాల అనుమతులు త్వరగానే లభించేలా చేస్తుంది. ముఖ్యంగా డిజిటల్ విధానంలో భూ వ్యవహారాలు సాగుతున్నాయి. దీనివల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోతున్నాయి. ఇవి మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని" భూములు కొనుగోలు చేస్తున్న వారు అంటున్నారు.

గ్లోబల్ క్యాపిటల్ గా విశాఖ

విశాఖపట్నం ప్రాంతాన్ని పర్యాటకంగానే ఇప్పటిదాకా చూశారు. అయితే ఆ నగరంలో మరో కోణాన్ని చూశారు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు. అందువల్లే ఈ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారు. 2014 నుంచి 2019 వరకు విశాఖపట్నంలో విస్తృతంగా రోడ్లను నిర్మించారు. ఐటీ కార్యకలాపాలకు విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని కార్పొరేట్ కంపెనీలకు సంకేతాలు పంపించారు. దీంతో మనదేశంలో పేరుపొందిన కంపెనీలు శాఖలను ఏర్పాటు చేశాయి. 2019లో ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత ఐటీ కార్యకలాపాలు మందగించాయి.మళ్లీ ఇప్పుడు ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం రూపు రేఖలు మారిపోతున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా ఐటీ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇప్పటికాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా పనిచేసే డేటా సెంటర్లు కూడా విశాఖపట్నంలో ఏర్పాటు కాబోతున్నాయి. దీనికి తోడు క్లౌడ్ కంప్యూటింగ్ విభాగంలో కూడా విశాఖపట్నం అగ్రగామిగా వెలుగొందడానికి అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో మౌలిక వసతులు పెరిగిపోవడం.. భూములు ఇవ్వడానికి రైతులు ముందుకు రావడంతో అక్కడ పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోంది..చంద్రబాబు విశాఖపట్నం గ్లోబల్ క్యాపిటల్ గా మార్చడానికి అడుగులు వేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ నగరంలో ఐటి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేశారు. ఇప్పుడు ఏపీలో ముఖ్యంగా విశాఖపట్నంలో ఐటీ ఆధారిత కార్యకలాపాలు సాగడానికి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. విశాఖపట్నం కి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి ఆ మధ్య జరిగిన ప్రపంచం పెట్టుబడిదారుల సదస్సులను ఉపయోగించుకున్నారు. ఈ క్రమంలోనే విశాఖపట్నంలో గూగుల్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి అనుకూల పరిస్థితులు కల్పించారు. కేంద్రంలో ఎలాగూ సపోర్ట్ ఉంది కాబట్టి.. చంద్రబాబు గూగుల్ ప్రతినిధులతో మంతనాలు జరపడం ఈజీ అయిపోయింది.ఐటీ మంత్రిగా నారా లోకేష్ తెరమందు ప్రయత్నాలు మొత్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను సరళీకృతం చేశారు. ప్రపంచ పెట్టుబడిదారులకు గుమ్మంగా విశాఖపట్నం ఎందుకు ఉంటుందో పదేపదే వివరించే ప్రయత్నం చేశారు. దీనికి తోడు భూముల కేటాయింపు నుంచి మొదలుపెడితే అనుమతుల వరకు ప్రతి విషయంలోనూ ఆయన చొరవ తీసుకున్నారు. అందువల్లే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చింది. గూగుల్ సంస్థ రావడంతో.. రిలయన్స్.. అదాని.. మిట్టల్ వంటి సంస్థలు కూడా వచ్చేశాయి. ఇవన్నీ కూడా ఒక విశాఖపట్నం నగరంలోనే దాదాపు మూడు లక్షల కోట్లకు మించి పెట్టుబడులు పెడుతున్నాయి. దీనిని బట్టి విశాఖపట్నం నగరానికి భవిష్యత్తు కాలంలో ఏ స్థాయిలో డిమాండ్ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.. ఒక బిజినెస్ ఏర్పాటు కావాలంటే దానికి అనుకూల పరిస్థితులు ఉండాలి. ఆ పరిస్థితులను చంద్రబాబు కల్పించారు కాబట్టి.. విశాఖపట్నం గ్లోబల్ కాపిటల్ గా మారబోతోంది.

# మావిగన్ తో జగన్ కు బంపర్ మైలేజ్

విజయవాడ, ఏప్రిల్ 30,



వైసీపీ ట్రెడిషనల్ పాలిటిక్స్ కి దూరంగా ఉండే పార్టీ. ఒక భిన్నమైన వైఖరితో సాగే పార్టీ. ప్రచారం విషయంలో చూస్తే ఆ పార్టీ తీరే వేరుగా ఉంటుంది. అవతల ప్రత్యర్థి టీడీపీ అయితే పబ్లిసిటీ విషయంలో చాలా స్పీడ్ గా ఉంటుంది. పైగా వ్యూహాలు ఎత్తుగడలలో టీడీపీని మించిన వారు ఉండరు. అలాంటి పార్టీతో వైసీపీ ఎపుడూ పోటీ పడలేని స్థితిలోనే ఉంటుంది. అలాంటివి వైసీపీ మావి గన్ అన్న ఒకే ఒక్క స్టెప్ తో ఏకంగా వంద కోట్ల రూపాయిల విలువ చేసే పబ్లిసిటీని ఫ్రీగా కొట్టేసిందా అన్న చర్చ అయితే సాగుతోంది. మావిగన్ అన్నది వైసీపీ కాకతాళీయంగా అన్నదా లేక మనసులో ఉంచుకుని సరైన సమయంలో వదిలిన పంచ్ నా లేక టీడీపీ కూటమి అమరావతి రాజధాని అన్న బలమైన స్లోగన్ ని ఎంతో కొంత అడ్డుకునేందుకు వేసిన పాచికా అన్నది తెలియదు కానీ మావిగన్ మాత్రం జగన్ నోటి వెంట రాగానే సోషల్ మీడియా మొత్తం షేక్ అయింది. అంతే కాదు ఏపీ రాజకీయమంతా మొదట షాక్ అయింది ఆ మీదట హీటెక్కిపోయింది. ఇక మావిగన్ అన్నది ట్రెండింగ్ లో ఉంటూ ట్రోలింగ్ కా బాప్ అనిపించుకుంది. ఇది నెగిటివ్ ప్రచారమా లేక పాజిటివ్ ప్రచారమా అన్నది పక్కన పెడితే వైసీపీని ఎక్కడో తీసికెళ్ళి పెట్టింది అన్నది మాత్రం వాస్తవం అని అంతా అంటున్నారు. వైసీపీ అధినేత 2017 లో నిర్వహించిన భారీ పాదయాత్ర సమయంలో వైసీపీకి వచ్చిన హైప్ పొలిటికల్ గా హైలెట్ అయిన తీరు అందరికీ తెలిసిందే. ఆ తరువాత అంతటి పొలిటికల్ వైబ్రేషన్స్ అయితే వైసీపీకి ఎక్కడా రాలేదు. అధికారంలో ఉన్నపుడు కానీ గడచిన రెండేళ్ళ విపక్ష పాత్రలో కానీ వైసీపీ డిఫెన్స్ మోడ్ లో ఉంటోంది. చాలా సార్లు సైలెంట్ మోడ్ నే నమ్ముకుంది. ఇక అనేక సార్లు కార్నర్ అవుతూ వస్తోంది. కానీ ఇన్నేళ్ళ తరువాత మళ్లీ నాటి హైప్ వైసీపీకి క్రియేట్ అయింది అంటే దానికి వన్ అండ్ ఓన్లీ రీజన్ మావిగన్ అని అంటున్నారు. మావిగన్ అన్న మూడు అక్షరాల పదం వైసీపీని పొలిటికల్ గా ఏపీ రాజకీయ తెర మీద ఫుల్ ఫోకస్డ్ గా నిలిచేలా చేసింది అని అంటున్నారు. ఇక దీని మీద జరిగిన చర్చ ఇంతా అంతా కాదు అది పాజిటివ్ గా జరిగిందా లేక నెగిటివ్ గా జరిగిందా అన్నది పక్కన పెడితే వైసీపీ అన్న పేరు ప్రతీ చోటా నానేలా చేసింది. ఆ విధంగా చూస్తే ఏప్రిల్ నెల మొదటి తేదీన వైసీపీ అధినేత జగన్ వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టారు. ఆ రోజున ఆయన మావిగాన్ అని ప్రతిపాదించారు. అంతే నాటి నుంచి దాదాపుగా నెల రోజులుగా అదే సోషల్ మీడియాలో తెగ ట్రెండింగ్ అవుతోంది. ఎంతలా అంటే మరే టాపిక్ కూడా కనీసంగా చర్చకు నోచుకోనంతగా ఈ ఒక్క టాపిక్ తోనే వైసీపీ బహుళ ప్రచారం పొందింది. నిజం చెప్పాలంటే ఈ సమయంలో అంటే వైసీపీ భారీ ఓటమిని అందుకుని విపక్షంలో ఉంటూ కేవలం 11 సీట్లతో చతికిలపడిన వేళ ఆ పార్టీ రాజకీయంగా ఇబ్బందులు పడుతున్న వేళ వచ్చిన ఈ బూస్టింగ్ కానీ జరిగిన ప్రచారం కానీ రూపాయలలో లెక్క కడితే కచ్చితంగా వంద కోట్ల పై మాటే అంటున్నారు. అంటే పార్టీ ఖజానా నుంచి వంద కోట్లు తీసి పబ్లిసిటీ చేయించుకుంటే వచ్చే పబ్లిసిటీ ఫ్రీగానే వచ్చేసింది అన్న మాట. ఈ ప్రచారం అంతా మీడియానే మోసింది. భారీగా చేసింది. అది మెయిన్ స్ట్రీమ్ మీడియానా లేక సోషల్ మీడియానా లేక డిజిటల్ ఫ్లాట్ ఫారం నా అన్నది పక్కన పెడితే ఒక్క మావిగన్ తో వైసీపీ అచ్చంగా ఉచిత ప్రచారాన్ని వందల కోట్ల దాకా పొందేసింది. ఇందులో జనాలదే తొంబై శాతం పాత్ర అయితే వైసీపీ నుంచి మావిగాన్ ని సమర్ధించుకుంటూ చేసిన ప్రచారం కేవలం పది శాతం మాత్రమే. అంటే ఇంతలా ఇది ప్రచారం అవుతుందని బహుశా వైసీపీ కూడా ఊహించి ఉండదు ఏది ఏమైనా వైసీపీకి ఈ సమయంలో అయితే ఇది బాగా జనంలో ఫోకస్ అయ్యేలా చేసింది మరి ఇది పాజిటివ్ గానా నెగిటివ్ గానా అన్నది పక్కన పెడితే ఒక రాజకీయ పార్టీకి కావాల్సినంత ప్రచారం అయితే దక్కింది. ఆ విధంగా వైసీపీ లక్కీ అనే అంటున్నారు.

==============

# సాంఘిక సంక్షేమ వసతిగృహాల ఉత్తమ ఫలితాలు ::
## 582 మార్కులతో మెరిసిన జూపాడుబంగ్లా విద్యార్థిని సి.నోమేశ్వరి :: అభినందించిన జిల్లా అధికారిణి

ఆత్మకూరు డివిజన్ పరిధిలో మొత్తం 132 మంది వసతిగృహ విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా, వారిలో 118 మంది 89.39 శాతంతో ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ప్రభుత్వ బాలుర వసతిగృహం, శ్రీశైలం నందు 11 మందికి గాను 11 ఉత్తీర్ణులయ్యారు – వీరిలో డి.దుర్గా ప్రసాద్ నాయక్ 438 మార్కులు సాధించారు. ప్రభుత్వ బాలుర వసతిగృహం, పగిడ్యాల నందు 16 మందికి గాను 16 మంది ఉత్తీర్ణులయ్యారు – వీరిలో డ.యశ్వంత్ కుమార్ 576 మార్కులు సాధించారు. ప్రభుత్వ బాలికల వసతిగృహము, అత్మకూరు నందు 21 మందికి గాను 18 మంది; ప్రభుత్వ బాలికల వసతిగృహము, పాములపాడు నందు 40 మందికి గాను 34 మంది; ప్రభుత్వ బాలికల వసతిగృహము, జూపాడుబంగ్లా నందు 26 మందికి గాను 25 మంది – వారిలో సి.నోమేశ్వరి అత్యధికంగా 582 మార్కులు మరియు ఈ.కల్పన 579 మార్కులు సాధించారు. ప్రభుత్వ బాలుర వసతిగృహం, మిడ్తూరు నందు 18 మందికి గాను 14 మంది ఉత్తీర్ణులయ్యారు, వీరిలో వి.మహేష్ 555 మార్కులు సాధించారు. జిల్లా కలెక్టరు మేడమ్ గారు మరియు జిల్లా సాఅ సంక్షేమ ఉ సాధికారతా అధికారి ఎం.చింతామణి ప్రత్యేక ప్రణాళికలతో, ఈ ఉత్తమ ఫలితాలు సాధించడం జరిగినదని ఆత్మకూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బట్టు అంకన్న తెలియజేశారు.

==================================

# బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం

ప్రజాస్వామ్య భారత్‌లో ఎన్నికలు అంటే కేవలం ఓట్లు వేయడం మాత్రమే కాదు. ఆ ఓటు ఫలితం ఏంటో తెలుసుకోవాలని ఉత్సుకత ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ప్రజల నాడిని పట్టుకోవాలని ప్రయత్నించే చర్య సర్వేలు. ప్రస్తుతం 2026లో ఐదు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ కూడా వచ్చాయి. అయితే ఈ సర్వేలు ఎలా చేస్తారు. వీటికి ఉండే చట్టబద్ధత ఏంటీ అనే విషయాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒపీనియర్ పోల్ లేదా అభిప్రాయ సేకరణ అనేది ఎన్నికలు ప్రారంభంకావడానికి ముందే నిర్వహించే సర్వే. నామినేషన్ల ప్రక్రియకు ముందు లేదా ప్రచారం జరుగుతున్న సమయంలో వీటిని చేపడతారు. ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు, వారి ప్రధాన సమస్యలు ఏంటీ, ప్రచార పద్ధతులు ఓటర్లను ఎంత వరకు ప్రభావితం చేస్తున్నాయి అనేది తెలుసుకోవడానికి సర్వేలు చేస్తారు. శాంపిల్ సైజ్ నుంచి సమాచారాన్ని సేకరిస్తారు. ఎన్నికల ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రజల అభిప్రాయాలు మారే ఛాన్స్ ఉంది. అందుకే ఒపీనియన్ పోల్ ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎగ్జిట్ పోల్ అనేది ఓటు వేసిన తర్వాత బయటకు వచ్చిన ఓటరు అభిప్రాయాన్ని నేరుగా సేకరించే ప్రక్రియ. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రం వెలుపల ఈ సర్వే చేస్తారు. సర్వే చేసే వ్యక్తులు పోలింగ్ బూత్ బయట వేచి ఉండి, ఓటు వేసి వస్తున్న వారిని మీరు ఎవరికి ఓటు వేశారు అని అడిగి తెలుసుకుంటారు. ఓటరు తన నిర్ణయాన్ని అమలు చేసిన తర్వాత చెప్పే మాటలు కాబట్టి ఇవి ఒపీనియన్ పోల్స్ కంటే కాస్త కచ్చితత్వానికి దగ్గరగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే. అధికారిక ఫలితాలు కావు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగడానికి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రూల్స్ ఫ్రేమ్ చేసింది. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై ఆంక్షలు విధించింది. ఎన్నికలు ఒకటి కంటే ఎక్కువ దశల్లో జరుగుతున్నప్పుడు అన్ని దశల పోలింగ్ పూర్తి అయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించకూడదు. ఇవాళ కూడా దీన్ని అమలు చేసింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలకు ముగిసింది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఆరున్న తర్వాత వెల్లడించారు. ఈ రూల్స్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయి. మీడియా సంస్థలు, పరిశోధన ఏజెన్సీలు, పోలింగ్ సంస్థలు వివిధ పద్ధతుల ద్వారా డేటాను సేకరిస్తాయి. క్షేత్రస్థాయిలో ఓటర్లతో మాట్లాడటం ద్వారా, టెలిఫోన్ ద్వారా ఓటర్ల అభిప్రాయం తెలుసుకుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో టీంలను పంపించి సమాచారాన్ని సేకరిస్తారు. మరో వైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని సర్వేలు డీఎంకే కూటమిదే మళ్లీ అధికారమని అంచనా వేశాయి. కానీ, ఒక్క సంస్థ మాత్రం దళపతి విజయ్ పార్టీ టీవీకే మెజార్టీ స్థానాల్లో గెలిచి, అధికారం చేపడుతుందని తెలిపింది. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీ సునామీ తథ్యమని జోస్యం చెప్పింది. ఆ సంస్థ అంచనా ప్రకారం టీవీకే 98 నుంచి 120 స్థానాలు, డీఎంకే కూటమి 92 నుంచి 110, అన్నాడీఎంకే కూటమి 22 నుంచి 30 సీట్లలో గెలుస్తుందని పేర్కొంది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడులో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు. ఆ సర్వే అంచనా నిజమైతే విజయ్ ముఖ్యమంత్రి అవుతారు. అయితే, తుది ఫలితాలు అంచనాలకు దగ్గరగా ఉంటాయా? లేదా? అనేది మే 4న తేలిపోనుంది. అంతేకాదు, అంచనాలు తారుమారై డీఎంకే కూటమి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఆగిపోతే విజయ్ మద్దతు కీలకమవుతుంది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.అయితే, గతంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో యాక్సిస్ మై ఇండియా సర్వేలు నిజమయ్యాయి. గతంలో ఐదు సందర్భాల్లో మిగతా సంస్థలకు భిన్నంగా దీని అంచనాలు, ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి 359 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఈ అంచనాలకు అనుగుణంగా ఫలితాలు వచ్చాయి. 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, గతేడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలోనూ ఖచ్చితంగా అంచనా వేసింది. మధ్యప్రదేశ్‌లో అన్ని సర్వేలూ కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. యాక్సిస్ మై ఇండియా మాత్రం 140-162 సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. అన్నట్టుగానే బీజేపీ 163 సీట్లతో మళ్లీ అధికారం నిలబెట్టుకుంది.ఎగ్జిట్ పోల్స్ ఎప్పుడూ ఓట్ల లెక్కింపు రోజున వాస్తవ ఫలితాలుగా మారనప్పటికీ, అవి ప్రజా చర్చను ప్రభావితం చేస్తూ, తుది తీర్పుపై ఉత్కంఠను పెంచుతాయి. ఇక బెంగాల్ విషయానికి వస్తే పీపుల్స్ పల్స్ సర్వే టీఎంసీకి 177 నుంచి 187, బీజేపీకి 95-110 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. మ్యాట్రిజ్ సర్వే టీఎంసీ 125 నుంచి 140, బీజేపీ 146-161 చోట్ల విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే, పీ-మార్క్ సర్వే మాత్రం టీఎంసీ 118-138, బీజేపీ 150-175 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. చాణక్య స్ట్రాటజీస్ కూడా బీజేపీకి ఛాన్స్ ఉందని వెల్లడించింది. బీజేపీకి 150-160 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు 130-140 స్థానాలు వచ్చే ఛాన్స్ ఉందని తెలిపింది. పోల్ డెయిరీ కూడా కమలం వికసిస్తుందని అంచనా వేసింది. టీఎంసీకి 99 నుంచి 127, బీజేపీకి 142 నుంచి 171, కాంగ్రెస్ 3 నుంచి 5 స్థానాల్లో విజయం సాధిస్తాయని చెప్పింది. జన్మత్ 195 నుంచి 205 స్థానాలు టీఎంసీకి, 80 నుంచి 90 స్థానాలు బీజేపీకి వస్తాయని అంచనా వేసింది. అలాగే, ఎన్డీటీవీ అంచనాలు కూడా టీఎంసీ 146, బీజేపీ 140, ఇతరులు 6 చోట్ల విజయం సాధించే అవకాశం ఉన్నాయని తెలిపాయి.మరి ఈసారి కూడా ఈ సంస్థ అంచనాలు నిజమవుతాయా? అనేది మే 4న తెలుస్తుంది. తమిళనాడు ఎన్నికల్లో తొలిసారి పోటీచేసిన విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. ఈ సర్వే అంచనా వేసినట్టు ఫలితాలు ఉంటే.. విజయ్ చరిత్రను తిరగరాయనున్నారు.ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంస్థలు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఓటింగ్ సరళిని అంచనా వేయడానికి ఈ పద్ధతులను అనుసరించాయి. ఎగ్జిట్ పోల్స్ అనేవి కేవలం సంకేతాలు మాత్రమే ఇవి ఎప్పుడూ కచ్చితంగా ఉంటాయని చెప్పలేం. అనేక సందర్భాల్లో ఎగ్జిట్‌పోల్ అంచనాలు లెక్క తప్పుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఒకట్రెండు మినహా మిగతా సర్వే సంస్థల లెక్కలు తెప్పాయి.

# సొంత ఇమేజ్ పై దివ్యదృష్టి...

కాకినాడ, ఏప్రిల్ 30,

రాజకీయాల్లో వారసత్వాలకు కొదవలేదు. అది పురుషులైనా మహిళలైనా ఇటీవల కాలంలో రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ పొలిటికల్ కెరీర్ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తుని నియోజకవర్గం ఎమ్మెల్యే కీలకమని చెప్పాలి. గత ఎన్నికల్లో తుని నియోజకవర్గ నుంచి మాజీ మంత్రి సీనియర్ మోస్ట్ నాయకుడు యనమల రామకృష్ణుడి కుమార్తె యనమల దివ్య పోటీ చేశారు.. విజయం కూడా దక్కించుకున్నారు. నిజానికి వైసీపీ ఇక్కడ బలంగా ఉంది. స్థానికంగా కూడా వివాదరహితంగా వైసిపి గత ఎన్నికల సమయంలో వ్యవహరించింది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ తునిలో వైసీపీ విజయం సాధిస్తుందని చాలామంది అంచనా వేశారు. కానీ దీనికి భిన్నంగా తుని పొలిటికల్ తెరపై తొలిసారి యనమల రామకృష్ణుడి కుమార్తె దివ్య విజయం సాధించారు. పైగా ఆ సమయంలో సొంత కుటుంబంలోనే రెండు వర్గాలుగా ఏర్పడిన పరిస్థితి ఉంది, యనమల రామకృష్ణుడు సోదరుడు యనమల కృష్ణుడు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. టిడిపి ఓటు బ్యాంకు చీల్చే ప్రయత్నం చేశారని పెద్ద ఎత్తున చర్చ కూడా సాగింది. యనమల దివ్య ఘన విజయం దక్కించుకున్నారు. నియోజకవర్గంలో ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఇప్పుడు రెండు సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత మరి ఆమె పరిస్థితి ఏ విధంగా ఉంది.. నియోజకవర్గం అభివృద్ధి.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరు ప్రజలకు అందుతున్న లబ్ధి వంటివి ఏ మేరకు దివ్యకు పేరు తీసుకు వస్తున్నాయి.. అనేది చూస్తే సానుకూల పరిణామాలే కనిపిస్తున్నాయని స్థానిక రాజకీయ నాయకులు చెబుతున్నారు.గత ఎన్నికల వరకు యనమల రామకృష్ణుడి పేరుతోనూ యనమల కుటుంబం పేరుతో రాజకీయాలు చేసిన దివ్య ఇప్పుడు సొంతంగానే తన ఇమేజ్‌ను పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి తోడు వైసిపి తరఫున కార్యక్రమాలు చేసేందుకు పెద్దగా ఆసక్తి కనిపించని పరిస్థితి ఉంది. ఇది దివ్యకు మరింతగా కలిసి వచ్చింది. వ్యక్తిగతంగా ఉన్నత విద్యావంతురాలు అయిన దివ్య సమస్యలను పరిష్కరించే విషయంలోనూ అధికారులను ముందుకు నడిపించే విషయంలోనూ చాలా విజ్ఞతతో వ్యవహరిస్తున్నారు. ఆమె వేస్తున్న అడుగులు మంచి ఫలితాన్ని అందిస్తున్నాయి. ఎక్కడ ఎమ్మెల్యే పై వ్యతిరేకత కనిపించడం లేదు. సొంత పార్టీలోనూ కలివిడితనం స్పష్టంగా ఉంది. అయితే క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కలుపుకుని వెళ్లే విషయంలో ఎమ్మెల్యే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించాలి. నియోజకవర్గంలో అభివృద్ధి విషయాన్ని పరిశీలిస్తున్నప్పటికీ వ్యక్తిగత అంశాల విషయంలో కార్యకర్తల నుంచి వస్తున్న విజ్ఞాపనలను కూడా ఆమె పరిశీలనలోకి తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో వరుసగా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబుకు అందిన ఎమ్మెల్యేల రిపోర్టులో దివ్య తొలి 100 స్థానాల్లోనే ఉండడం విశేషం.

# కొంప ముంచుతున్న కృత్రిమ కొరత

కాకినాడ, ఏప్రిల్ 30, (

ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. విపక్షైసీపీఆయకులునిపై నిరసనలు తెలుపుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఏపీలో ఈ పరిస్థితి నెలకొందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి కొరత లేదని కూటమి అధికారంలో ఉన్న ఏపీలో మాత్రం ప్రజలకు పెట్రోల్, డీజిల్ దొరకడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అయితే సమస్యకు ప్రధాన కారణాలు పానిక్ కొనుగోళ్లు, సరఫరా ఆలస్యాలు, పరిశ్రమల డిమాండ్ మార్పులు అని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 4,500కి పైగా పెట్రోల్ బంకుల్లో 10?70 శాతం మూతపడ్డాయి. కర్నూలు, నంద్యాల్, గోదావరి, విశాఖలో నో స్టాక్ బోర్డులు కనిపించాయి. రోజువారీ 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9 వేల కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలకు 50 శాతం అధిక డిమాండ్ ఏర్పడటంతో సంక్షోభం తీవ్రమైంది. దొరకదనే కారణంతో చాలా మంది అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు.పానిక్ భయంతో అనవసర కొనుగోళ్లు పెరగడం కొరతకు ప్రధాన కారణం. సాధారణ అమ్మకాలకు రెట్టింపు డిమాండ్ వచ్చింది. పారిశ్రామికులు అధిక ధరల కారణంగా రిటైల్ డీజిల్‌కు మారారు, వ్యవసాయ రంగంలో కూడా డిమాండ్ పెరిగింది. యుద్ధాలు, ఆయిల్ కంపెనీల రెండు రోజుల ఆలస్య సరఫరా, క్రెడిట్‌కు బదులు క్యాష్ డిమాండ్ కృత్రిమ కొరతను మరింత పెంచాయి.సీఎం చంద్రబాబు పరిస్థితిపై సమీక్షలు నిర్వహించారు. అధిక సరఫరా కోరారు. . మంత్రి నాదెండ్ల మనోహర్ కొరత లేదని, పోయోకపోతే డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రైవేటు సంస్థల సరఫరా ఆగిపోవడంపై కూడా చర్చించారు.పానిక్ కొనుగోళ్లు తగ్గిస్తే సమస్య త్వరగా సద్దుమణుగుతుంది. ఆయిల్ కంపెనీలు సరఫరాను మెరుగుపరచాలి, పరిశ్రమలకు ప్రత్యేక సరఫరా ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం డీలర్లను పరిగణనలోకి తీసుకుని, పారదర్శకత పెంచాలి.

పొలిటికల్ మైలేజ్ కోసం వైసీపీ

ప్రజా సమస్యల పట్ల పోరాడాల్సిన అవసరం ప్రతిపక్ష పార్టీకి ఉంటుంది. ఎందుకంటే ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టాల్సిన బాధ్యత కూడా ప్రతిపక్ష పార్టీ మీద ఉంటుంది. కానీ ఏపీలో ఇందుకు విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. 2024 ఎన్నికల్లో అక్కడ కూటమి జోరు ముందు వైసిపి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. ప్రతిపక్ష హోదా కోసం అడుక్కోవలసిన పరిస్థితి ఆ పార్టీకి ఏర్పడింది.. ఏపీలో కూటమి ప్రభుత్వానికి సమాంతరంగా మరో పార్టీ లేదు కాబట్టి.. కాంగ్రెస్ పార్టీ అక్కడ తుడిచి పెట్టుకుని పోయింది కాబట్టి.. వైసిపి నే అనధికారికంగా ప్రతిపక్ష హోదాలో ఉంది. ఆ పార్టీ అధ్యక్షుడిగా జగన్మోహన్ రెడ్డి ఉన్నారు.జగన్మోహన్ రెడ్డి ఆ మధ్య రైతుల సమస్యల మీద ధర్నాలు చేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక అనధికారిక ప్రతిపక్ష నాయకుడిగా అది ఆయనకు లభించిన గౌరవం. ఆయన ఆ పని చేయాలి కూడా.. కాకపోతే ప్రజా సమస్యలపై పోరాడుతున్నామని చెప్పి ప్రభుత్వంపై అడ్డగోలుగా విమర్శలు చేస్తే జనం అసలు సహించరు.ప్రస్తుతం మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం కొనసాగుతోంది. ఇప్పటికీ ఇరాన్ హార్మోజ్ జలసంధి విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఆ జల సంధి మీదుగా సరుకు రవాణా కావడం లేదు. యుద్ధం నిలిపివేతకు సంబంధించిన చర్చలు అర్థాంతరంగా ముగిసిపోయాయి. కేవలం మన దేశం మాత్రమే కాకుండా.. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు మధ్య ఆసియా ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పటికే బ్యారెల్ ముడి చమురు ధర పెరిగింది. ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. తగిన ఇంధన నిల్వలు ఉన్న నేపథ్యంలో కంపెనీలు కూడా పెద్దగా రేట్లు పెంచలేదు. అయితే కమర్షియల్ డీజిల్ ధర పెరిగిన నేపథ్యంలో.. మిగతా డీజిల్ కు డిమాండ్ పెరిగింది. పైగా ఆయిల్ కంపెనీలు సప్లై తగ్గించాయి. దీంతో డిమాండ్ పెరిగిన నేపథ్యంలో బంకుల వద్ద ప్రజల క్యూలు కడుతున్నారు. ఇదే క్రమంలో పానిక్ బయింగ్ పరిస్థితి ఏర్పడింది. ఇది దేశం మొత్తం మీద ఉంది.ఈ పరిస్థితికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కారణమని ట్విట్టర్లో ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. పైగా ఒక వీడియోను విడుదల చేశారు. వాస్తవానికి ప్రపంచ వ్యాప్తంగా విపత్కర పరిస్థితి ఉంటే చంద్రబాబు ఏం చేస్తారు.. చంద్రబాబు నిర్లక్ష్యం వల్ల ఏపీలో ఇంధన కొరత ఏర్పడిందని జగన్మోహన్ రెడ్డి ఆరోపించడం ఎంతవరకు న్యాయం.. అసలు ఇలాంటి సమయంలో రాజకీయాలు చేయడం అవసరమా.. ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలు చేస్తారా.. ఇప్పుడు ఇవే ప్రశ్నలను కూటమి నేతలు సంధిస్తున్నారు.. ఇప్పటికైనా జగన్ తను తీరు మార్చుకోవాలని సూచిస్తున్నారు.

# సొంత నియోజకవర్గాలపై దృష్టి

విజయవాడ, ఏప్రిల్ 30,

ఎన్నికలకు రెండున్నర సంవత్సరాలకు పైగా సమయం ఉంది. పైగా వారంతా సిట్టింగ్ ఎమ్మెల్యేలే. అయినప్పటికీ వచ్చే ఎన్నికలపై ఇప్పటి నుంచే కొందరు ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో తమ సొంత ప్రాంతాలను కాదని వేరే ప్రాంతాలకు వెళ్లి వేరే నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేశారు. దీంతో ఇప్పుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో.. వచ్చే ఎన్నికల్లో కూడా పోటీ చేస్తే తమ పరిస్థితి ఏమిటి అన్నది కొంతమంది ఎమ్మెల్యేలకు దిగులు పట్టుకుంది. ఇది వాస్తవం కూడా. గత ఎన్నికల్లో అంటే కూటమి ప్రభావం ఉంది. వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత కూడా ఉంది. కాబట్టి ఎవరు పోటీ చేశారు.. ఎవరు నిలబడ్డారు.. అన్నది కూడా కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు గమనించలేదు. కేవలం పార్టీ గుర్తులు, పార్టీ అధినేతలను చూసి వారు ఓటేశారు. కానీ వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి రిపీట్ అవుతుందా అంటే కష్టం. ఎందుకంటే ఐదు సంవత్సరాల పరిపాలన కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఎంతో కొంత వ్యతిరేకత ఏ ప్రభుత్వం పైన అయినా ఉంటుంది. దీనికి చంద్రబాబు మాత్రం అతీతులు కారు. గత 2019 ఎన్నికల్లో ఓడిపోయిన విషయం గుర్తుండే ఉంటుంది కదా. ఈ నేపథ్యంలో ఇప్పుడు చాలామంది ఎమ్మెల్యేలు తమ తమ సొంత నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఒకవైపు పనులు చేస్తూనే.. ఎందుకైనా మంచిది అని తమ సొంత నియోజకవర్గాలపై ఒక అడుగు వేశారు. ఇటువంటి వారిలో మాజీ మంత్రులు ఉన్నారు. సీనియర్ నాయకులు కూడా ఉన్నారు. వీరంతా తరచుగా తమ తమ సొంత నియోజకవర్గంలో పర్యటించడంతోపాటు అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా తమ అనుచరుల ద్వారా తెలుసుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను వీరు నిరంతరం తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో తమ సొంత నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ గ్రాఫ్ ఏ విధంగా ఉంటుందన్న విషయాన్ని ఇప్పటినుంచి లెక్కలు కట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ జాబితాలో మాజీ మంత్రి ప్రస్తుతం ఎమ్మెల్యే కళా వెంకట్రావుతో పాటు సీనియర్ నాయకులు, జూనియర్ ఎమ్మెల్యేలు ఇలా అనేకమంది ఉన్నారు. వీరందరి లక్ష్యం.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించటం. అయితే తమది కానీ నియోజకవర్గంలో మళ్లీ పోటీ చేస్తే వ్యతిరేకత మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇది తమకు మైనస్ గా మారుతుందని భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు తమ తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేసి మరోసారి గెలుపు గుర్రం ఎక్కి దిశగా ఆలోచన చేస్తున్నారు. అప్పుడు ఎంత వ్యతిరేక ప్రభావం ఉన్నప్పటికీ.. సొంత నియోజకవర్గంలో సొంత అనుచరులు సొంత సామాజిక వర్గం తమకు సానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని నాయకులు అంచనా వేస్తున్నారు. మరి దీనికి ఎటువంటి పరిస్థితులు వస్తాయి.. పార్టీ అధినేత చంద్రబాబు ఏ విధంగా నిర్ణయం తీసుకుంటారు అనేది చూడాలి.

# కాళేశ్వరంపై రేవంత్ మార్క్ యుద్ధం

హైదరాబాద్, ఏప్రిల్ 30,

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన, అదే సమయంలో వివాదాస్పదమైన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం ఇప్పుడు ఒక కీలక మలుపు తిరిగింది. ప్రాజెక్టు వైఫల్యాలు, నిధుల దుర్వినియోగంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త యుద్ధ తంత్రాన్ని సిద్ధం చేశారు. ఈ వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ– సీబీఐ చేత దర్యాప్తు చేయించడం ద్వార అటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ను, ఇటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరకాటంలో పెట్టే వ్యూహానికి రేవంత్ పదును పెట్టారు.సాధారణంగా ఇలాంటి భారీ ప్రాజెక్టులపై విచారణలు న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకుపోతుంటాయి. దీనిని ముందుగానే పసిగట్టిన రేవంత్ సర్కార్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు తాజాగా మధ్యంతర ఆదేశాలు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంపిన సీబీఐ సిఫారసులో ఆ కమిషన్ ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడింది. దీనికి బదులుగా, గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన ప్రాథమిక నివేదికలను, ప్రాజెక్టులో జరిగిన నిధుల మళ్లింపు ఆరోపణలను ప్రధాన ప్రాతిపదికగా చూపారు. 9 నెలల కిందటే పంపిన ఈ సిఫారసు ద్వారా సీబీఐ రంగప్రవేశానికి ఉన్న సాంకేతిక అడ్డంకులను ప్రభుత్వం తొలగించింది. వ్యవస్థాగతమైన దర్యాప్తు ద్వారా బాధ్యులను బోనులో నిలబెట్టడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా బీఆర్ఎస్ అగ్రనేతలపై చర్యలకు ఉపక్రమిస్తే, అది రాజకీయంగా కక్షసాధింపు అనే ముద్ర పడి సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశం ఉందని రేవంత్ భావిస్తున్నారు. అందుకే ఈ బంతిని కేంద్రం కోర్టులోకి విసిరారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయిన ఈ కుంభకోణంపై కేంద్రమే విచారణ జరిపించాలని కోరడం ద్వారా బీజేపీ చిత్తశుద్ధిని రేవంత్ పరీక్షకు పెట్టారు. ఒకవేళ కేంద్రం సీబీఐ విచారణకు వెనుకాడుతే, "మోదీ–కేసీఆర్ ఒక్కటే" అనే ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, బీజేపీని డిఫెన్స్‌లో పడేయాలన్నది కాంగ్రెస్ వ్యూహం. సీబీఐ దర్యాప్తునకు పచ్చజెండా ఊపితే ఆ క్రెడిట్ రేవంత్ ఖాతాలోకి వెళ్తుంది. ఒకవేళ మౌనంగా ఉంటే బీఆర్ఎస్‌ను కాపాడుతున్నారన్న విమర్శలు వస్తాయి.కేవలం లేఖలతోనే సరిపెట్టకుండా, రేవంత్ రెడ్డి స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలవాలని లేదా మంత్రుల బృందాన్ని ఢిల్లీకి పంపాలని నిశ్చయించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ప్రాథమిక ఆధారాలను స్వయంగా అందజేయడం ద్వారా దర్యాప్తును అనివార్యం చేయాలన్నది వారి ప్లాన్. విచారణ జరిగినా, జరగకపోయినా.. ఈ అంశాన్ని కేంద్రంపైకి నెట్టడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందవచ్చని, ప్రజాధనం విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవచ్చని రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. ఒకవేళ విచారణ ప్రారంభమై కేసీఆర్ కుటుంబం చుట్టూ ఉచ్చు బిగిస్తే, తెలంగాణ రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా పెను మార్పులు సంభవించడం ఖాయం. రేవంత్ రెడ్డి పన్నిన ఈ చక్రవ్యూహం నుండి ప్రత్యర్థులు ఎలా బయటపడతారో వేచి చూడాలి.

# ఇవాళ్టి నుంచి భారీగా రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ

హైదరాబాద్, ఏప్రిల్ 30

తెలంగాణలో స్థిరాస్తి కొనుగోలు చేయాలనుకునే వారికి బ్యాడ్ న్యూస్. మే 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకునేందుకు సిద్ధమైంది. అపార్ట్‌మెంట్ అయినా, ప్లాట్ అయినా, వ్యవసాయ భూమి అయినా.. ఇకపై మీ జేబుకు చిల్లు పడటం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ఆస్తుల మార్కెట్ విలువలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మే మొదటి వారం నుంచే అమల్లోకి రానుంది. ఈ మార్పుతో రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ భారం ఒక్కసారిగా పెరగనుంది.రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన కేబినెట్ ఉపసంఘం ఇటీవల సచివాలయంలో కీలక భేటీ నిర్వహించింది. రాష్ట్ర ఆదాయ మార్గాలను పెంచుకోవడమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో.. ఆస్తుల మార్కెట్ విలువల సవరణకు పచ్చజెండా ఊపారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ ధరలకు, ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న ధరలకు మధ్య పొంతన లేకపోవడాన్ని గమనించిన ప్రభుత్వం, ఈ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా కొత్త రేట్లను సిద్ధం చేయాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ఆదేశించింది.ప్రభుత్వ అంచనాల ప్రకారం, ఈ విలువల సవరణ ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు అదనంగా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూరనుంది. కేవలం ఆదాయం మాత్రమే కాకుండా, మార్కెట్ ధరలను క్రమబద్ధీకరించడం ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనం ప్రవాహాన్ని అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. చాలా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ ధరలు ఆకాశంలో ఉండగా, రిజిస్ట్రేషన్ విలువలు మాత్రం తక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ గ్యాప్‌ను పూడ్చడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు వ్యూహంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయం వల్ల మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. పట్టణ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలు, ఓపెన్ ప్లాట్ల విలువలు గణనీయంగా పెరగనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల విలువలను కూడా భారీగా పెంచబోతున్నారు. కమర్షియల్ ప్రాపర్టీల రిజిస్ట్రేషన్ రేట్లు కూడా చుక్కలు చూపించనున్నాయి. కేవలం ఆస్తి విలువ పెరగడమే కాకుండా, ఆ పెరిగిన విలువపై చెల్లించే స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు అన్నీ కలిపి కొనుగోలుదారుడిపై భారాన్ని రెట్టింపు చేస్తాయి.తెలంగాణలో గతంలో 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మార్కెట్ విలువలను సవరించింది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న తొలి విలువల సవరణ ఇదే కావడం గమనార్హం. నిజానికి ఏడాది క్రితమే ఈ రేట్లు పెరగాల్సి ఉన్నప్పటికీ, అప్పట్లో రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నెలకొన్న మందగమనం కారణంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇప్పుడు మార్కెట్ మళ్లీ పుంజుకోవడంతో ఈ నిర్ణయాన్ని అమలులోకి తెస్తోంది.మే మొదటి వారం నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయన్న సంకేతాలతో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రద్దీగా మారే అవకాశం ఉంది. పెరిగే భారం నుంచి తప్పించుకునేందుకు చాలా మంది ఏప్రిల్ నెలాఖరు లోపే తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని భావిస్తున్నారు. స్లాట్ల బుకింగ్ కోసం జనం ఎగబడే అవకాశం ఉండటంతో రిజిస్ట్రేషన్ శాఖ కూడా అప్రమత్తమైంది.

===============

# యాక్షన్ మోడ్ లోకి కేటీఆర్


హైదరాబాద్, ఏప్రిల్ 30,

రంగంలోకి కేటీఆర్.. ఫస్ట్ స్టెప్‌లోనే సంచలన నిర్ణయం! బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు.. 'సంపూర్ణ బాధ్యతలు' అప్పగిస్తున్నట్టు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన 24 గంటల్లోనే కేటీఆర్ రంగంలోకి దిగిపోయారు. బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు.. 'సంపూర్ణ బాధ్యతలు' అప్పగిస్తున్నట్టు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన 24 గంటల్లోనే కేటీఆర్ రంగంలోకి దిగిపోయారు. రాష్ట్ర స్థాయి కమిటీని అలానే ఉంచి.. జిల్లా, మండల స్థాయి కమిటీలను వెంటనే రద్దు చేశారు. ఇదేసమయంలో తన విచక్షణ మేరకు కీలక నేతలను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో తొలి అడుగుగా.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై కేటీఆర్ దృష్టి పెట్టారు. దీనిలో జరిగే అవకతవకలను గుర్తించే బాధ్యతను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌కు అప్పగించారు.హైదరాబాద్, సికింద్రాబాద్‌లో చేపట్టిన సర్ ప్రక్రియలో అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీలు చేతులు కలిపే ప్రమాదం ఉందని.. బీఆర్ ఎస్ అనుకూల ఓట్లను తొలగించే అవకాశం ఉందని కేటీఆర్ అంచనా వేశారు. ఈ క్రమంలో నకిలీ ఓట్లు, దొంగ ఓట్లను గుర్తించడం తోపాటు.. బీఆర్ ఎస్ అనుకూల ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించకుండా చూడాలని తలసానికి కేటీఆర్ సూచించారు. దీనికి సంబంధించి పార్టీ తరఫున కార్యకర్తలను నియమించుకుని పర్యవేక్షించే అవకాశం ఆయనకు కల్పించారు. ఏ ఒక్క బీఆర్ ఎస్ సానుకూల ఓటు కూడా పోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు.గత ఏడాది జరిగిన.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికలో బీఆర్ ఎస్ అనుకూల ఓట్లను తొలగించారని.. అందుకే తాము నష్టపోయామని చెప్పారు. ఈ నేపథ్యంలో గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సర్ ప్రక్రియను అత్యంత నిశితంగా పరిశీలించాల ని సూచించారు. అదేవిధంగా రాబోయే ఎన్నికలపైనా కేటీఆర్ ముందస్తుగానే సమీక్షలు నిర్వహించారు. ఏయే నియోజకవర్గాల్లో ఏమేరకు సానుకూలత ఉందన్న విషయాన్ని ఆరా తీశారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. ప్రజల మధ్య ఉండే నాయకులే గుర్తింపు ఉంటుందని తేల్చేశారు. తన సోదరి కవిత రాజకీయాలు.. ఆమె పెట్టుకున్న టీఆర్ ఎస్ పార్టీపైనా కేటీఆర్ నర్మగర్భంగా మాట్లాడారు. కొత్త పార్టీ అని పిలుస్తూ.. "కొత్త పార్టీలపై ఎవరూ స్పందించొద్దు. సమయం, సందర్భం చూసుకుని కేసీఆర్ సర్ స్పందిస్తారు. అప్పటి వరకు ఓపికగా ఉండండి. ఎన్ని పార్టీలు వచ్చినా.. కేసీఆర్ నాయకత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయంలో రెచ్చగొట్టే వ్యాఖ్యల విషయంలో మీరు అప్రమత్తంగా ఉండండి" అని నాయకులకు తేల్చి చెప్పారు. త్వరలోనే జిల్లాలు, మండలాల వారీగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

# మెట్రో మైలు రాళ్లు...

హైదరాబాద్, ఏప్రిల్ 30,

భాగ్యనగర మెట్రో రైలు ప్రయాణాల్లో సరికొత్త రికార్డును సృష్టించింది. ఈ నెల 24వ తేదీ నాటికి మెట్రో రైలు ప్రారంభమైనప్పటి నుండి మొత్తం ప్రయాణీకుల సంఖ్య 850 మిలియన్లకు (85 కోట్లు) చేరుకుంది. గత ఏడాది డిసెంబర్ 19న ఈ సంఖ్య 800 మిలియన్లుగా ఉండగా, కేవలం 126 రోజుల వ్యవధిలోనే మరో 50 మిలియన్ల (5 కోట్లు) మంది మెట్రోలో ప్రయాణించారు. ప్రస్తుతం సగటున రోజుకు 3.96 లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు.గతంలో రోజువారీ సగటు ప్రయాణీకుల సంఖ్య 4.50 లక్షల వరకు ఉండేదని, అయితే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత మెట్రో ప్రయాణీకుల సంఖ్య కొంత తగ్గుముఖం పట్టినట్లు ఎల్ అండ్ టీ మెట్రో వర్గాలు భావిస్తున్నాయి. దీనికి తోడు మెట్రో స్టేషన్ల వద్ద 'ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ' (స్టేషన్ల వరకు చేరుకునే రవాణా సౌకర్యాలు) సరిగ్గా లేకపోవడం కూడా ఒక ప్రధాన లోపంగా కనిపిస్తోంది.ఇటీవల ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె సమయంలో బస్సులు నిలిచిపోయినప్పటికీ, మెట్రోలో ఆశించిన స్థాయిలో రద్దీ పెరగకపోవడం అధికారులను ఆశ్చర్యపరిచింది.



# జయమ్మ బాటలో కవితమ్మ...

నిజామాబాద్, ఏప్రిల్ 30,

మనసులో మాట.. అంటూ కొత్తగా తెలంగాణ రాష్ట్ర సేన(టీఆర్ఎస్) పార్టీని ప్రారంభించిన కవిత కీలక ప్రకటన చేశారు. అదే 'తెలంగాణ తల్లి'గా తాను ఉండాలని భావిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. సహజంగా ఇది తమిళనాడులో మాత్రమే చెల్లింది. అక్కడ ఉమ్మడి పార్టీ అంటే ద్రవిడ పార్టీ నుంచి అన్న డీఎంకే విడిపోయినప్పుడు.. ఎంజీఆర్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన జయలలిత(జయమ్మ) తనకంటూ ఒక సొంత కుంపటిని ఏర్పాటు చేసుకునే క్రమంలో తమిళ ప్రజలకు తల్లిగా పరిచయమయ్యారు. ఇలాగే ఆవిడ కూడా తనను తల్లిగా భావించాలని కోరుకున్నారు. తమిళనాడు ప్రజలు ఆమెను రిసీవ్ చేసుకున్నారు. దీనికి కారణం ఏంటంటే.. ఆవిడ నటిగా తమిళ ప్రజల గుండెల్లో ఉన్నారు కాబట్టి అది సాధ్యమైంది. అప్పటికే వందలాది సినిమాల్లో ఆమె నటించారు. తమిళ ప్రజలను ఆకట్టుకున్నారు. కాబట్టి ఆమెను తల్లిగా భావించారు. అది సక్సెస్ అయింది. ఇప్పటికీ జయలలిత విగ్రహాలతో ఆలయాలు కట్టిన గ్రామాలు కూడా ఉన్నాయి తమిళనాడులో. కానీ ఆ పరిస్థితి కవితకు వస్తుందా.. ఆమె కామె అనుకుంటే తల్లిగా రిసీవ్ అవుతారా.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. తెలంగాణ సమాజం ఒక విభిన్నమైన ఆలోచనతో ఉంటుంది. సెంటిమెంటు అంటే అది వ్యక్తిగత సెంటిమెంటు కంటే కూడా సమాజ సెంటిమెంటుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ప్రజలు తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఒక ఘటనను తీసుకుంటే.. కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించారుఇంతలో ఢిల్లీ నుంచి వచ్చిన సమాచారంతో ఆయన దీక్ష విరమణ చేస్తున్నట్టు ప్రకటించారు. తెలంగాణ సమాజం తిరగబడే పరిస్థితి వచ్చింది. ఇంక తప్పని పరిస్థితుల్లో కేసీఆర్ దీక్షను కొనసాగించారు. అటువంటి సెంటిమెంటు ఉన్న తెలంగాణలో 'నేను అమ్మ'ని అని పరిచయం చేసుకోవడం వరకు బాగానే ఉ



న్నప్పటికీ తెలంగాణ సమాజం ఏ మేరకు దీన్ని ఆహ్వానిస్తుంది అనేది ప్రశ్న. ఇప్పటివరకు కవిత అంటే కెసిఆర్ కుమార్తె గానే చూశారు. ఒక ఎంపీగా ఒక ఎమ్మెల్సీగా ఒక రాజకీయ నాయకురాలుగా ఒక జాగృతి అధ్యక్షురాలుగా చూశారే తప్ప అకస్మాత్తుగా 'నేను అమ్మ'ని అని ఆవిడ చెప్పినంత మాత్రాన తెలంగాణ సమాజం ఆ రకంగా రిసీవ్ చేసుకోవడం కష్ట సాధ్యం. అంతేకాదు ఆవిడ చెప్పినంత తేలికగా తెలంగాణ సమాజం కవితను అమ్మగా చూసే పరిస్థితి కూడా ఉండదు. ఎవరికి ఉండే అంచనాలు వారికి ఉంటాయి తప్పేమీ కాదు. కానీ.. ఎక్కువగా ఊహించుకుంటేనే ప్రమాదం. ఈ విషయంలో కవిత ఆలోచించుకుని అడుగులు వేయడం ఉత్తమమని పరిశీలకులు చెబుతున్నారు.

# మే చివరి వారంకానీ జూన్ లో పంచాయితీ పోల్స్ కు ఏర్పాట్లు

విజయవాడ, ఏప్రిల్ 30,

ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13,100 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగియడంతో పాలన మొత్తం ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్ళింది. ప్రభుత్వం ఈ వేసవిలోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ మళ్ళీ పట్టాలెక్కే సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో, క్షేత్రస్థాయిలో పాలన స్తంభించకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే, గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి సుదీర్ఘకాలం అధికారుల పాలనను కొనసాగించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢ నిశ్చయంతో ఉన్నారు. వీలైనంత త్వరగా అంటే.. మే లేదా జూన్ నెలల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో, ప్రభుత్వ భవనాలు, ఉపాధ్యాయుల సేవలను ఎన్నికల విధులకు వినియోగించుకోవడం సులభతరం అవుతుంది. ఇదే తరుణంలో ఎన్నికలు నిర్వహిస్తే అటు విద్యా సంవత్సరంపై ప్రభావం ఉండదని, ఇటు వర్షాకాలం మొదలవ్వకముందే కొత్త పాలకవర్గాలు కొలువు తీరుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం దీనిపై ప్రాథమిక కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. వార్డుల పునర్విభజన , రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకంగా మారింది. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటి భారీ విజయం తర్వాత వస్తున్న ఈ స్థానిక ఎన్నికలను కూటమి పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. జనసేన, బీజేపీలతో కలిసి రిజర్వేషన్ల కేటాయింపులో ఎక్కడా వివాదాలు రాకుండా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సాంకేతిక ప్రక్రియ మే నెలలో పూర్తి చేసి, జూన్ కల్లా పోలింగ్ నిర్వహించేలా కార్యాచరణ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్ష వైసీపీ కూడా ఈ ఎన్నికలపై గట్టి ఆశలే పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత తమ క్యాడర్‌లో మళ్ళీ ఉత్సాహాన్ని నింపాలంటే స్థానిక సంస్థల ఎన్నికలే సరైన వేదిక అని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అయితే, అధికార పార్టీపై సానుకూలత ఉన్న సమయంలోనే ఎన్నికలకు వెళ్లడం ద్వారా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని టీడీపీ భావిస్తోంది. ఉపాధి హామీ నిధులు, గ్రామాలకు వచ్చే కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించాలంటే ఎన్నికైన పాలకవర్గాలే ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ నిబంధన కూడా దీనికి ప్రధాన కారణం. వేసవి సెలవుల లోపు నోటిఫికేషన్ విడుదల కాకపోతే, జూలైలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. అందుకే, సెక్షన్ 14 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి, వీలైనంత వేగంగా ఓటర్ల జాబితాల సవరణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# బెంగాల్ లో మార్పు ఖాయమేనా

కోల్ కత్తా, ఏప్రిల్ 30,

వెస్ట్ బెంగాల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. ఎక్కడ కూడా అధికార టిఎంసి నేతల్లో ఉత్సాహం కనిపించలేదు. కనీసం వారిలో గెలుస్తామని ఆశ కూడా కనిపించలేదు. దీనిని బట్టి అక్కడ బిజెపి హవా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో అధికార టీఎంసీ నాయకులు ప్రతిసారి దూకుడు కొనసాగిస్తుంటారు.. ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపిస్తుంటారు. అవసరమైతే హింసకు కూడా వెనుకాడరు. ప్రాణాలను కూడా తీస్తారు. ఎందుకంటే అది మమత రాసిన రాజ్యాంగం.. మమత బెనర్జీ గత 15 సంవత్సరాలుగా వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో రూపొందించిన తన మార్క్ న్యాయం. అవినీతి అక్కడ నిత్య కృత్యం.. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులకు అది సురక్షితమైన షెల్టర్.. మమత బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారికి అద్భుతంగా అండదండలు లభించాయి. చివరికి ఆధార్ కార్డులు.. ఓటరు గుర్తింపు కార్డులు కూడా అందాయి. దీంతో మమత పార్టీ కి దండిగా ఓట్లు పడ్డాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేంద్ర ఎన్నికల సంఘం అక్రమంగా నమోదైన ఓటర్లను ఏరి వేసే కార్యక్రమం చేపట్టింది.. దీంతో చాలామంది అక్రమార్కులు తమ ఓటు హక్కును కోల్పోయారు. ఇది ఒక రకంగా మమతకు గట్టి ఎదురు దెబ్బ. అయితే ఈసారి ఎన్నికలను బిజెపి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి సందర్భంలోనూ మమతకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో తిరుగులేని స్ట్రాటజీని పాటించింది. ఫలితంగా మమత ఏమీ చేయలేని స్థితిలో కూరుకుపోయింది. మీరు ఆశీర్వదిస్తే ఇలాంటి సభలకు వస్తాను. లేనిపక్షంలో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటానని ఎన్నికల సభలో మమత వ్యాఖ్యానించిందంటే.. అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వెస్ట్ బెంగాల్ లో బిజెపి నాయకత్వం ఈసారి ఏకతాటి మీద పని చేసింది. విభేదాలను పక్కనపెట్టింది. సీట్ల విషయంలో కూడా అత్యంత జాగ్రత్తలు పాటించింది. అధికార టీఎంసీ నేతల ఆగడాలను ఎక్కడికి అక్కడ అడ్డుకుంది. అందువల్లే బిజెపి ఈసారి అక్కడ అధికారంలోకి వచ్చే అవకాశం కనిపిస్తుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మొత్తంగా 294 స్థానాలు ఉన్నాయి. మెజారిటీ సంస్థలు బిజెపి అధికారంలోకి వస్తుందని ప్రకటించాయి. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో అస్సాం, పుదుచ్చేరి ప్రాంతాలలో ఎన్డీఏ గెలుపు దాదాపుగా ఖాయం. ఇప్పుడు అదనంగా వెస్ట్ బెంగాల్ కూడా బిజెపి ఖాతాలో చేరుతోంది. ఈ ప్రకారం చూసుకుంటే భవిష్యత్ కాలంలో కేరళ, తమిళనాడులో కూడా బిజెపి జెండా ఎగురుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

================

# కరీంనగర్ లో కయ్యాల కాంగ్రెస్

కరీంనగర్, ఏప్రిల్ 30, (

కాంగ్రెస్ అంటేనే కయ్యాల పార్టీ. తెలుగు రాష్ట్రాల్లో అయితే మరీ ఎక్కువ. ఒక నేత ఎదుగుదలను మరో నేత ఓర్వలేడు. ఒకరి ఆధిపత్యాన్ని మరోకరు సహించరు. ఎవరికి వారు గ్రూపులుగా ఉంటారు. అవసరమైతే అధిష్టానాన్ని కూడా బూతులు తిడతారు. తర్వాత కలిసే ఉంటారు. ఏమన్నా అంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని పెద్దపెద్ద మాటలు చెబుతారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో కొన్నాళు కయ్యాలు కనిపించలేదు. కానీ ఆరు నెలలుగా లుకలుకలు బయటపడుతున్నాయి. తాజాగా కరీనంగర్‌లో బిభేదాలు రచ్చకెక్కాయి. కరీంనగర్ కాంగ్రెస్‌లో ఇన్‌చార్జి నియామకం వివాదం పార్టీ ఐక్యతను దెబ్బతీసింది. స్థానిక నేతల అసంతృప్తి, అధిష్ఠాన నిర్ణయాలపై బహిరంగ తిరస్కారం శ్రేణుల్లో గందరగోళాన్ని మురికి చేస్తోంది. వెలిచాల్ రాజేందర్ రావును కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం పలువురు స్థానిక నాయకుల అభ్యంతరానికి దారితీసింది. సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు తమ పేర్లతో వినతిపత్రాలు సమర్పించారని, తమ సమ్మతి లేకుండానే జరిగిందని మండిపడ్డారు. సన్నాహక సమావేశాల్లోనే విభేదాలు బహిర్గతమై, గొడవల వరకు వెళ్లింది. మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌లాంటి మునుపటి నాయకులు పార్టీ నాయకత్వంపై ఫైర్ అవుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల్ రాజేందర్ రావును లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల్లో సహకారం లేకపోవడం, టికెట్ కేటాయింపుల్లో భేదం వంటి ఆరోపణలు ఉన్నాయి. డీసీసీ కార్యాలయంలో రహస్య సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కరీంనగర్ కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట జరుగుతోంది. గత మున్సిపల్ మున్సిపల్ ఎన్నికల్లో 66 డివిజన్లలో కేవలం 14 సీట్లకే పరిమితమైంది. ఇన్‌చార్జి లేకపోవడం, జిల్లా అధ్యక్ష పదవి ఆలస్యం ఈ సమస్యలకు ఆధారం. మంత్రివర్గ విస్తరణలో కూడా స్థానికులకు ప్రాధాన్యత లేకపోవడంపై నిరాశ వ్యక్తమవుతున్నారు. ఈ వివాదం పీసీసీ స్థాయికి చేరి, సస్పెన్షన్ డిమాండ్లు ఉయరుతున్నాయి. ఎన్నికల విషయాల్లో పార్టీ బలం తగ్గుతున్న ఈ ప్రాంతంలో ఇది మరింత దెబ్బ తీస్తుంది. అధిష్టానం త్వరగా స్థానిక నేతలతో సమావేశాలు నిర్వహించి, పునర్నియామకాలు చేయాలి. పారదర్శకత, స్థానిక ప్రాతినిధ్యం పెంచితే శ్రేణులు ఏకతాటిపై నడవవచ్చు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో మూడో స్థానానికి మాత్రమే పరిమితమవుతుంది.

# ఇవాళ్టి నుంచి సర్కారీ మెట్రో...

హైదరాబాద్, ఏప్రిల్ 30,

హైదరాబాద్ మహానగర ముఖ చిత్రాన్ని మార్చేసిన లక్షలాది మందికి చేరువైన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో ఒక కీలక అధ్యాయం ముగిసింది. ఇన్నాళ్లూ ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం కింద లార్సన్ అండ్ టూబ్రో(ఎల్ అండ్ టీ) నిర్వహణలో ఉన్న మెట్రో మొదటి దశ, ఇప్పుడు పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ వశమైంది. దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోగా మెట్రో పగ్గాలను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చింది.. ఎల్ అండ్ టీ మెట్రో రైలు లిమిటెడ్‌లో ఉన్న మొత్తం వంద శాతం ఈక్విటీని 1, 461.47 కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ఒప్పంద పత్రాలపై హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ ప్రతినిధి డీకే సేన్, ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణరావు, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మెట్రో మాజీ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సాక్షులుగా ఉన్నారు అంతకు ముందు ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ ప్రక్రియపై చర్చించారు. మెట్రోను స్వాధీనం చేసుకోవడంలో కేవలం వాటాలను కొనుగోలు మాత్రమే కాకుండా భారీ ఆర్థిక బాధ్యతలను కూడా ప్రభుత్వం స్వీకరించింది. ఏప్రిల్ 30, 2026 నాటికి ఎల్ అండ్ టీ మెట్రోపై ఉన్న 13, 538.53 కోట్ల అప్పును ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేయనున్నారు. ఈ లావాదేవీ పూర్తి అయిన తర్వాత ఎల్ అండ్‌టీ ఈ మెట్రో ప్రాజెక్టుతో ఎటువంటి అనుబంధం ఉండదు. ఈ ప్రక్రియ జూన్ 30 నాటికి పూర్తి కావచ్చని అంచనా. ఈ భారీ లావాదేవీకి ఐడీబీఐ క్యాపిటల్ టాన్సాక్షన్ అడ్వైజర్‌గా, సరఫ్ అండ్ పార్ట్‌నర్స్ లీగల్ అడ్వైజరీగా వ్యవహరించాయి. హైదరాబాద్ మెట్రో ప్రయాణం 2010లో ప్రారంభమైంది. మొదట మేటాస్ కన్సార్షియం ఈ టెండర్ పొందినా, సత్యం కుంభకోణం తర్వాత అది రద్దు అయ్యింది. 2010లో జరిగిన రెండో టెండర్లలో ఎల్ అండ్ టీ అత్యంత తక్కువ కోట్ చేసి ప్రాజెక్టును దక్కించుకుంది. అప్పట్లో ఇది ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది. 71 కిలోమీటర్ల మేర ప్రాజెక్టు అంచనా వ్యయం మొదట 12, 132 కోట్లు కాగా, పూర్తి అయ్యే సరికి ఇది పెరిగింది. బ్యాంకుల నుంచి 11, 478 కోట్ల రుణం, ఎల్ అండ్ టీ వాటా 3,440 కోట్లుగా ఉంది. మొదటి దశ 2017నవంబర్ 29న ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 69.2 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లలో సేవలు అందుతున్నాయి.

ప్రభుత్వ స్వాధీన నిర్ణయానికి కారణాలు ఇవే



ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగడానికి, ప్రభుత్వం దీనిని స్వీకరించడానికి బలమైన కారణాలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో ఆరు నెలలపాటు మెట్రో నిలిచిపోవడంతో ప్రాజెక్టు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. ప్రభుత్వం అప్పట్లో 900 కోట్ల వడ్డీ లేని రుణాన్ని కూడా ఇచ్చింది. మొదట 35 ఏళ్ల ఒప్పందం ఉండగా, దానిని 2072 వరకు అంటే మరో పాతికేళు పొడిగించారు. అయితే ఆర్థిక ఒత్తిడి కారణంగా ఎల్ అండ్ టీ తప్పుకోవాలని భావించింది. మొదటి దశ ప్రైవేటు వద్ద, రెండో దశ ప్రభుత్వం వద్ద ఉంటే నిర్వహణలో ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వం భావించింది. ఇప్పుడు రెండు దశలూ ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉండటం వల్ల సమగ్ర రవాణా వ్యవస్థను నిర్మించడం సులభమవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో నిత్యం సగటున 4.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇప్పటి వరకు 86 కోట్ల ప్రయాణాలు నమోదు అయ్యాయి. మెట్రో ప్రభుత్వపరమవ్వడం వల్ల భవిష్యత్‌లో కొత్త మెట్రో లైన్ల నిర్మాణం పాత కారిడార్ల అనుసంధానం వేగవంతం అవుతుంది. ప్రయాణికుల అవసరాలు అనుగుణంగా ఛార్జీలు, సమయపాలన, ఇతర సదుపాయాలపై ప్రభుత్వం పూర్తి నిర్ణయాధికారం కలిగి ఉంటుంది. సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన ఫ్యూచర్ సిటీకి మెట్రోను అనుసంధానించే ప్రక్రియ మరింత సులభతరం చేయవచ్చు.

# బీజేపీని నిండా ముంచుతున్న అన్నాడీఎంకే

చెన్నై, ఏప్రిల్ 30,

మిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ని పక్కన పెట్టింది. ఏఐడీఎంకే చెప్పినట్టుగా సీట్లకు ఒప్పుకొంది. అన్ని విధాలుగా.. అన్ని అంశాలలో రాజీ పడింది. వాస్తవానికి కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ.. బిజెపికి తమిళనాడులో ఏమి చేయలేని పరిస్థితి. అందువల్లే ఏఐడీఎంకే ఆడించినట్టు ఆడింది. ఇంత చేసినప్పటికీ ఏమైనా ఉపయోగం ఉందా అంటే.. అది పలుచూపువేరలో కూడా కనిపించడం లేదు. ఎగ్జిట్ పోల్స్ లో ఏ సంస్థ కూడా ఏఐటీఎంకే అధికారాన్ని దక్కించుకుంటుందని ప్రకటించలేదు.. పీపుల్ పల్స్ నుంచి మొదలు పెడితే చాణక్య స్ట్రాటజీస్ వరకు ప్రతి సంస్థ కూడా తమిళనాడు రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వస్తుందని ప్రకటించాయి. ఇక్కడ ద్రావిడ సెంటిమెంట్ ముందు జాతీయవాదం పనిచేయదని నిరూపించాయి. తమిళనాడు రాష్ట్రంలో 180 ప్లస్ సీట్లతో డిఎంకె కూటమి విజయం సాధిస్తుందని స్మార్ట్ పోల్ సంస్థ ప్రకటించింది. ఇందులో ఏ ఐ డి ఎం కే కూటమికి కేవలం 28 సీట్లు మాత్రమే వస్తాయని ప్రకటించింది. ఓటు షేర్ విషయంలో కూడా కేవలం 27.6 చేత మాత్రమే లభిస్తుందని స్పష్టం చేసింది. మాట్రిజ్ సంస్థ భిన్నమైన ఫలితాన్ని చెప్పినప్పటికీ.. ఈ సంస్థకు అంత గొప్పగా క్రెడిబుల్టి లేదు. ఈ సంస్థ ఏఐడీఎంకే కూటమికి 87 నుంచి 110 సీట్లు వస్తాయని ప్రకటించింది. యాక్సిస్ మై ఇండియా సంస్థ ఏఐడీఎం కే కూటమికి 22 నుంచి 32 స్థానాలకు వస్తాయని వెల్లడించింది.. చాణక్య స్ట్రాటజీస్ కూడా ఏఐడీఎంకేకు తమిళనాడులో అధికారం రాదని స్పష్టం చేసింది. ఈ కూటమికి కేవలం 50 నుంచి 65 స్థానాలు మాత్రమే వస్తాయని వెల్లడించింది. వాస్తవానికి బిజెపి అధినాయకత్వం తమిళనాడు విషయంలో అంతగా చొరవ చూపలేదని తెలుస్తోంది. వెస్ట్ బెంగాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రముఖంగా ప్రచారం చేశారు. అక్కడి ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేశారు. కానీ అదే దూకుడు తమిళనాడులో కొనసాగించలేకపోయారు. పైగా బిజెపి రాష్ట్ర నేతలు ఇక్కడ తలా ఒక దిక్కుగా మారిపోయారు. అన్నామలై మాటకు విలువ లేకపోవడంతో ఆయన ఎన్నికల్లో టచ్ మీ నాట్ అన్నట్టుగా వ్యవహరించారు. కొత్త అధ్యక్షుడు లేకి వ్యాఖ్యలు చేసి.. తమిళ హీరో విజయ్ కి క్షమాపణలు చెప్పారు. ఇక ఏఐడీఎంకే నేతలు కూడా ఇష్టానుసారంగా సీట్ల కేటాయింపు జరిపారు. అత్యంత కఠినమైన సీట్లను బిజెపికి ఇచ్చారు. ఈ విషయాన్ని బిజెపి అధినాయకత్వంతో స్థానిక నాయకులు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా తమిళనాడు ఎన్నికల్లో ఏఐడీఎం కే కూటమి మరోసారి విఫల బృందంగా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

# పెద్ది బిగ్ ట్వీట్...

హైదరాబాద్, ఏప్రిల్ 30,

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరో గా నటిస్తున్న 'పెద్ది' మూవీ షూటింగ్ రేపటితో పూర్తి అవ్వబోతుంది. గత మూడు రోజులుగా రామ్ చరణ్ , శృతి హాసన్ లపై ఐటెం సాంగ్ ని చిత్రీకరిస్తున్నారు. రేపటితో ఈ సాంగ్ చిత్రీకరణ ముగుస్తుంది. ఇకపోతే ఈ చిత్రాన్ని జూన్ 25 న విడుదల చేయబోతున్నట్టు డైరెక్టర్ బుచ్చి బాబు రీసెంట్ గా జరిగిన ఒక ఈవెంట్ లో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే జూన్ 4 నుండి టాక్సిక్ చిత్రం వాయిదా పడడంతో , ఇప్పుడు 'పెద్ది ' ని జూన్ 4 న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇదంతా పక్కన పెడితే ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి.పూర్తి వివరాల్లోకి వెళ్తే 'పెద్ది' లో రామ్ చరణ్ ఇప్పటి వరకు క్రికెట్ ఆడడం చూసాము, అదే విధంగా కుస్తీ ఆడడం కూడా చూశాము , ఇప్పుడు రామ్ చరణ్ ఈ చిత్రం లో మూడవ స్పోర్ట్ కూడా ఆడాడట. మరి ఆ స్పోర్ట్ ఏంటి అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. సినిమాలో చివరి 40 నిమిషాల్లో వచ్చే స్పోర్ట్ లో రామ్ చరణ్ నట విశ్వరూపం చూపించాడని , ఫ్యాన్స్ తో పాటు ఆడియన్స్ నుండి కూడా ఆయనకు ఈ చివరి 40 నిమిషాల్లో చేసే నటనకు ప్రశంసల వర్షం కురిపిస్తారని, రామ్ చరణ్ కి ఈ సినిమా ద్వారా మొట్టమొదటి నేషనల్ అవార్డు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. త్వరలోనే ఈ స్పోర్ట్ కి సంబంధించిన టీజర్ ని కూడా విడుదల చేయబోతున్నారట మేకర్స్. ఇకపోతే ఈ సినిమాకు సంబంధించిన ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ మే మొదటి వారం లో మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

# సోషల్ మీడియా తీర్పే ఫైనలా..?

## అన్‌ఫాలోలే రాజకీయ భవిష్యత్తుకు సంకేతమా..?

**రాఘవ్ చద్దాకి కొత్త పరీక్ష..**
**పార్టీ మారిన కొన్ని గంటల్లోనే**
**ఇన్‌స్టాలో 10 లక్షలకు పైగా అన్ ఫాలో...చెడ్డ రాజకీయాలు..!**
**ఫేక్ ఫాలోవర్లను క్రియేట్ చేసే ప్రయత్నాలు..**

.దేశ రాజకీయాల్లో యువ నాయకత్వానికి ప్రతీకగా ఎదిగిన రాఘవ చద్దా తాజా పరిణామాలతో మరోసారి చర్చల్లో నిలిచారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి భారతీయ జనతా పార్టీలో చేరిన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియా (ఇన్‌స్టాగ్రామ్) 10 లక్షలకుపైగా ఫాలోవర్స్ అన్‌ఫాలో చేయడంపై రాజకీయంగా చర్చనీయాంశమైంది. దీనిని కేవలం డిజిటల్ పరిణామంగా గాక ప్రజాభిప్రాయంలో వచ్చిన ప్రతిస్పందనగా భావించాల్సిన పరిస్థితి. నేటి రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రజా అనుసంధానానికి నాయకులకు ప్రధాన వేదికగా మారిన నేపథ్యంలో, ఈ తరహా భారీ అన్‌ఫాలోలు విశ్వాసంలో వచ్చిన చీలికను స్పష్టంగా చూపిస్తున్నాయి.చద్దా ఎదుగుదలకు యువతే ప్రధాన బలం. పార్లమెంటరీ చర్చల్లో చురుకుదనం, మీడియా కమ్యూనికేషన్ నైపుణ్యం, పట్టణ యువతతో సాన్నిహిత్యం వంటి అంశాలు అతనికి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. అలాంటి నాయకుడిపై ఒక్కసారిగా డిజిటల్ వ్యతిరేకత వెల్లువెత్తడం, యువత రాజకీయ ఆలోచనల్లో వస్తున్న మార్పుకు సంకేతంగా చూడాలి. పార్టీ మార్పు రాజకీయాల్లో సాధారణమే అయినప్పటికీ, సిద్ధాంతపరమైన స్పష్టత లేకుండా జరిగితే అది అవకాశవాదంగా ముద్రపడే ప్రమాదం ఉంది. ఈ సందర్భంలో అన్‌ఫాలోల సంఖ్య, యువతలో పెరుగుతున్న విలువాధారిత రాజకీయ అవగాహనను ప్రతిబింబిస్తోంది.రాజకీయ నమ్మకానికి తక్షణ కొలమానంగా సోషల్ మీడియా .. సోషల్ మీడియా ఇప్పుడు కేవలం ప్రచార సాధనం కాదు, అది రాజకీయ నమ్మకానికి తక్షణ కొలమానం. ఎన్నికల ముందు సర్వేలు, జనసభలు ఎంత ప్రాధాన్యం కలిగి ఉన్నాయో, ఇప్పుడు డిజిటల్ స్పందన కూడా అంతే ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా పట్టణ, మధ్యతరగతి, చదువుకున్న యువతలో అభిప్రాయాల మార్పు వేగంగా ప్రతిఫలిస్తోంది. ఒక నాయకుడి నిర్ణయం నచ్చకపోతే వెంటనే అన్‌ఫాలో చేయడం ద్వారా అసమ్మతి వ్యక్తం చేసే సంస్కృతి బలపడుతోంది. ఇది భవిష్యత్ రాజకీయ ప్రచార శైలిని కూడా మార్చే సూచన.ప్రజా విశ్వాసంతో ముడిపడుతున్నాయి?జాతీయ రాజకీయాల దృష్టిలో ఈ పరిణామం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. పార్టీ మార్పులు ఇప్పటి వరకు వ్యూహాత్మకంగా మాత్రమే పరిగణించబడ్డాయి. కానీ ఇప్పుడు అవి ప్రజా విశ్వాసంతో ముడిపడుతున్నాయి. ఒకవైపు పాత మద్దతుదారులు దూరమవడం, మరోవైపు కొత్త పార్టీలో పూర్తి స్థాయి ఆమోదం ఆలస్యమవడం రెండు పడవల మధ్య పరిస్థితిని సృష్టించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పంజాబ్ వంటి ప్రాంతాల్లో చద్దా వ్యక్తిగత ఇమేజ్ దెబ్బతింటే, అది స్థానిక రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే సోషల్ మీడియా ప్రతిస్పందనలను పూర్తిగా తుది తీర్పుగా పరిగణించడం సరైంది కాదు. రాజకీయాల్లో సంస్థాగత బలం, కేడర్ మద్దతు, నాయకత్వానికి దగ్గరదనం, వ్యూహాత్మక ప్రాధాన్యత వంటి అంశాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తాయి. అయితే బీజేపీ వంటి జాతీయ పార్టీలో నాయకుడి స్థానం కేవలం ఫాలోవర్స్ సంఖ్యలపై ఆధారపడదు. కానీ డిజిటల్ ప్రతికూలతను నిర్లక్ష్యం చేయడం కూడా ప్రమాదకరం.విశ్వాసం కోల్పోవడం క్షణాల్లోనే.. నిలబెట్టుకోవడమే కష్టం...ఏది ఏమైనప్పటికీ ప్రజల విశ్వాసం సంపాదించడం కష్టం, కోల్పోవడం మాత్రం క్షణాల్లో జరుగుతుందన్న విషయాన్ని తాజాగా ఇన్‌స్టాగ్రామ్ లో చద్దా అన్‌ఫాలోల ఘటన ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. డిజిటల్ యుగంలో నాయకులు తీసుకునే ప్రతి నిర్ణయం వెంటనే ప్రజా పరిశీలనకు లోనవుతోందని తెలియజేసింది. కాబట్టి స్పష్టమైన రాజకీయ ధోరణి, విలువలపైన నిలబడే ధైర్యం, ప్రజలతో నిరంతర కమ్యూనికేషన్ వంటివే భవిష్యత్ నాయకత్వానికి పునాది. చద్దా గానీ మరెవరైనా గానీ ముఖ్యంగా సోషల్ మీడియాను ప్రధాన వేదికగా చేసుకుని రాజకీయాల్లో ఎదిగే వారి ముందు ఉన్న సవాలు కూడా ఇదే. డిజిటల్ దూరాన్ని తగ్గించి, వాస్తవ రాజకీయాల్లో తన స్థిరత్వాన్ని నిరూపించగలగడం. చద్దా విషయంలో అదే జరిగితే ఈ అన్‌ఫాలోల తుఫాను తాత్కాలికమే అవుతుంది; లేకపోతే అది రాజకీయ ప్రయాణంలో దీర్ఘకాల ప్రభావం చూపే మలుపుగా మిగిలిపోతుంది.చెడ్డ రాజకీయాలు..! ఫేక్ ఫాలోవర్లను క్రియేట్ చేసే ప్రయత్నాలు..అయితే రాఘవ్ చద్దా తన ఇన్‌స్టా లో అన్ ఫాలో అయిన వారి సంఖ్యను కొంత వరకైనా రికవర్ అయినట్లు చూపించుకుని తనకు ప్రజాధరణ తగ్గలేదని నిరూపించుకోవడం కోసం నానా తంటాలు పడుతున్నారు. ఫేక్ ఫాలోవర్లను క్రియేట్ చేస్తున్నారని తాజాగా కొందరు అతని ఫేక్ లేదా కృత్రిమంగా తయారు చేస్తున్న ఫాలోవర్ల వివరాలను వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల ద్వారా నిరూపిస్తుండడం అతని ఇమేజ్‌ను మరింత డామేజ్ చేస్తోంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నేతలను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు

## బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ .ఎస్ .ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 30,

రాష్ట్రంలో రైతుల పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. కేసీఆర్ సీఎంగా ఉంటే ఢిల్లీ మెడలు వంచే వారు. సీఎం రేవంత్ రెడ్డి టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ నాయకులను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో పోలీసు అధికారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా విచారణ చేయాలి. కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావు ను ఇరికించాలని రెండవ సిట్ వేశారు. ఫోన్ ట్యాపింగ్ అనేది చట్టబద్ధంగా దేశ భద్రత కోసం జరుగుతుంది. ఏ ప్రభుత్వం ఉన్నా ట్యాపింగ్ జరుగుతుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ నేతలను ఇరికించే ప్రయత్నం జరుగుతుంది. 350 మంది సాక్షులను విచారించి ఇప్పటి వరకు ఛార్జ్ షీట్ దాఖలు చేయలేదు. ప్రభాకర్ రావును 18 రోజులు జైల్లో కరుడుగట్టిన నేరస్తుడిలా ట్రీట్ చేశారని అన్నారు.

ఫోన్ ట్యాపింగ్ ఛార్జ్ షీట్ లో కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావు పేర్లు పెట్టాలని అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఒత్తిడి తెస్తున్నారు. సంధ్య శ్రీధర్ రావుపై 26 కేసులు ఉన్నాయి.అతనితో ఎమ్మెల్సీ నవీన్ రావు పేరు చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సీనియర్ జర్నలిస్టును ఇరికించి అతను సుప్రీంకోర్టులో బెయిల్ పిటీషన్ వేస్తే హరీష్ రావు పేరు చెప్తారా లేదా అని బెదిరిస్తున్నారు. కేసీఆర్ ఇంటి గోడలపై నోటీసులు అంటించి ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది రహస్యంగా ఉంటుంది. భాద్యత లేని హోంమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పోలీసు డిపార్ట్మెంట్ బలైంది. రేవంత్ రెడ్డి ఆదేశాలతో పోలీసులు తప్పులు చేస్తున్నారు. నంబీ నారాయణన్ అనే ఇస్రో సైంటిస్ట్ పై అక్రమ కేసు మోపినందుకు విచారణ చేసిన వాళ్ళను కోర్టు దోషులుగా ప్రకటించింది. క్రిశాంక్ పై కేసు పెట్టి జైలుకు పంపారు. కేటీఆర్,హరీష్ రావు ఇళ్ల ముందు ఉన్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారు. బెంగుళూరు నుంచి ప్రయివేటు హ్యాకర్లను తీసుకువచ్చి ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు. దీనిపై సిట్ వేసి విచారణ జరపాలి. రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీలో ఎంత మంది బీసీ,ఎస్సి,ఎస్టీలు డైరెక్టర్లుగా ఉన్నారు. ఐపీఎస్ అధికారులు సీఎం ఆదేశాలను పాటించవద్దు. కేసులను ధైర్యంగా ఎదుర్కొంటాము. గతంలో నాకు యాపిల్ ఫోన్ నుంచి వచ్చిన మెసేజ్ ను సెంట్రల్ క్రైం పోలీసులకు ఇచ్చానని అన్నారు.

# సురేష్ నాయక్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

హైదరాబాద్, ఏప్రిల్ 30,

ఉస్మానియా పీజీ విద్యార్థి డాక్టర్ కట్రావత్ సురేష్ నాయక్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు హైదరాబాద్ హైదర్గూడలోని ఎన్ఎస్ఎస్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మాట్లాడారు.

ఈ సమావేశంలో మృతుడు సురేష్ నాయక్ తల్లి నాగమణి, బావ రవి కూడా పాల్గొన్నారు. సురేష్ నాయక్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్ జనరల్ సర్జరీ విభాగంలో పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడని వారు తెలిపారు. ఇటీవల ఉస్మానియా మెడికల్ కాలేజీని సందర్శించి ఘటనపై నిజ నిర్ధారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న సురేష్ నాయక్ సీనియర్ల వేధింపుల కారణంగా మానసిక ఒత్తిడికి గురై ఈ ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు. విద్యార్థులకు అనుకూలంగా లేని ఎన్ఎంసీ నిబంధనలను సవరించాలని, అలాగే మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

# పోయిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 30,

ఛాదర్ఘాట్ పోలీసులు (11) పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను విజయవంతంగా స్వాధీనం చేసుకుని, వాటిని అసలైన యజమానులకు అప్పగించారు. దొంగతనం, ఎక్కడో పెట్టేసి మర్చిపోవడం, లేదా ప్రమాదవశాత్తు పోగొట్టుకోవడం వంటి కారణాల వల్ల ఈ ఫోన్లు పోయాయని, బాధితులు సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (అఇఎఖీ) పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేశారని తెలిసింది. ఈ ఫిర్యాదుల ఆధారంగా, పోలీసులు చాదర్ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆ పరికరాలను గుర్తించి, బాధితులకు తిరిగి అప్పగించారు. టెలికమ్యూనికేషన్ల శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్, అప్పటి నుండి పనిచేస్తోందని మలక్పేట్ ఏసీపీ కె. సుబ్బారామి రెడ్డి, చాదర్ఘాట్ ఇన్స్పెక్టర్ బ్రహ్మ మురారి కసాని తెలిపారు. తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న పౌరులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్, ఎన్సీఆర్పి పోర్టల్ ద్వారా లేదా 1930 హెల్ప్లైన్కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేయాలని వారు సూచించారు. చాదర్ఘాట్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

# మేడిపల్లి పీఎస్ పరిధిలో వరుస చోరీల నిందితుడు అరెస్ట్

## రిమాండ్‌కు తరలింపు

మేడ్చల్ , ఏప్రిల్ 30,

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వరుస ఇళ్ల చోరీల కేసులను మేడిపల్లి పోలీసులు ఛేదించి, అలకుంట్ల ప్రశాంత్ (19) అనే పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.బోడుప్పల్, పీర్జాదిగూడ, కంచన్‌బాగ్, సింగారం ప్రాంతాల్లో రాత్రి వేళల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో పీర్జాదిగూడలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2026 ఫిబ్రవరి నెల నుంచి ఈ వరుస చోరీలకు సంబంధించి మేడిపల్లి పీఎస్‌లో మొత్తం 10 కేసులు నమోదు కాగా, అన్నింటిలోనూ ప్రశాంతే నిందితుడిగా గుర్తించారు.గతంలో 2023 సంవత్సరంలో మైనర్‌గా ఉండగానే పలు దొంగతనాల్లో పాల్గొని జువైనల్ హోమ్‌కు వెళ్లి వచ్చినప్పటికీ, మార్పు లేక మళ్లీ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బైక్, ఐఫోన్, సుమారు 40 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. అతడిని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించగా, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

==============================

# విద్యార్థుల భవిష్యత్ బలపడే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

## ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ ఏప్రిల్ 30,

దేవరకొండ నియోజకవర్గంలోని కొండల్లేపల్లి మండలం కోల్ ముంతల్ పహాడ్ గ్రామ రైతు వేదిక వద్ద 20 ఎకరాల్లో 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శాసన మండలి సభ్యులు గుత్తా సుఖేందర్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్మా ప్రభుత్వం "విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం" అన్న నమ్మకంతో, రాష్ట్రంలోని విద్యావ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తోంది. దేవరకొండలో నిర్మిస్తున్న ఈ స్కూల్ భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా, ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని అన్నారు.ప్రతి నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో, దేవరకొండలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా ముందుకు తీసుకొని రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు ఎ. రేవంత్ రెడ్డి తో కలిసి ప్రారంభం చేసుకుందాం అని అన్నారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు క్యాంపస్‌లోనే ఉండే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం.విద్యార్థుల సమగ్రాభివృద్ధికి, క్రీడా కార్యక్రమాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని ఈ సమగ్ర ఇంటిగ్రేటెడ్ స్కూల్ మోడల్ తెలంగాణ ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనం.పనులు వేగంగా సాగేందుకు ప్రతి 15 రోజులకు నిధులు విడుదల చేస్తున్నాం అని మంత్రి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే డైట్ చార్జీలను 40%, కాస్మెటిక్ చార్జీలను 200% పెంచి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలు తెలుసుకునే విధానాన్ని అమలు చేస్తున్నాం.గ్రామీణ రహదారి సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజల ప్రయాణ సౌలభ్యం పెరుగుతుందని, అలాగే స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఇది ఊతమిస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారులు అందుబాటులోకి రావడం వల్ల రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.దేవరకొండలో ఉన్న 100 పడకల ఆసుపత్రిని 200 పడకలుగా చేయాలని మంత్రి ని కోరారు.దేవరకొండలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు అన్ని త్వరితగతిన పూర్తి చేసి రైతంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది.కొండమల్లేపల్లి గ్రామంలోని కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయంలో 80. 00 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి రావెర్మాషన్,మున్సిపల్ చైర్మన్ వున్న శైలజ వెంకటేశ్వర్లు,వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్లు నాయిని జమున మాధవరెడ్డి, దొంతం అలివేలు సంజీవరెడ్డి, ఆర్డిఓ రమణా రెడ్డి , డీఈవో ,కోల్ ముంతల్ పహాడ్ గ్రామ సరస్వతి రవినాయక్ ,సర్పంచ్ యుగేందర్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ మెగా ఇంజనీరింగ్ సంస్థ లక్ష్మారెడ్డి,సేస్ ,ఉ ఈ డబ్ల్యు ఐ డి సి , నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేట్ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మండల మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు,మండల పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి వేడుకలో డాన్స్ చేస్తూ నవవధువు మృతి!

రాజస్థాన్‌లోని జలోర్ జిల్లా బాగోడాలో జరిగిన పెళ్లి వేడుకలో ఘోర విషాదం చోటుచేసుకుంది. 22 ఏళ్ల నవవధువు దీపిక డాన్స్ చేస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందింది. నాలుగు నెలల క్రితమే వివాహమైన ఆమె, గుండెపోటు కారణంగానే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సరదాగా సాగుతున్న వేడుకలో ఆమె అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ హృదయవిదారక ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# జిల్లా ప్రజలకు త్వరలో అధునాతన విమానయాన సేవలు

**-ఎయిరోడ్రోమ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**-జూన్‌లో ఎయిర్ పోర్టు కొత్త టెర్మినల్ ప్రారంభం**

**-భద్రత, మౌలిక సదుపాయాలు, అదనపు విమాన సర్వీసులపై దృష్టి**

వై ఎస్ ఆర్ కడప, ఏప్రిల్ 30(భారత శక్తి ) : జిల్లా ప్రజలకు త్వరలో అధునాతన విమానయాన సర్వీసులు చేరువ కానున్నాయని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

గురువారం స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో ఎయిరోడ్రోమ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కడప ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, జూన్ మాసంలో కొత్త డొమెస్టిక్ టెర్మినల్ భవనాన్ని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవారంగంలో ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఆధునిక జీవనశైలికి అనుగుణంగా విమానాశ్రయాల్లో ప్రయాణీకులకు సౌకర్యాలను మెరుగు పరుస్తోందన్నారు.

నూతన టెర్మినల్‌ను ప్రారంభించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. టెర్మినల్ ప్రారంభానికి ముందే అవసరమైన విద్యుత్ సరఫరా, నీటి సౌకర్యం, భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

విమాన భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలకు చీటజలు కఠినంగా ఇవ్వాలని, ఎత్తైన భవనాలపై రెడ్ అబ్స్ట్రక్షన్ లైట్లు తప్పనిసరిగా అమర్చాలని పేర్కొన్నారు. పక్షుల ప్రమాదాన్ని నివారించేందుకు చెత్త నిర్వహణ, పందుల పెంపకం, నీటి గుంతల నియంత్రణపై స్థానిక సంస్థలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎయిర్‌పోర్ట్ భద్రతకు సంబంధించి, రాష్ట్ర పోలీస్ విభాగం పరిమితి భద్రతను బలోపేతం చేయాలని, పరిసర ప్రాంతాల్లో



నివసించే వ్యక్తుల నేపథ్యాన్ని పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా ప్రముఖుల రాకపోకల సమయంలో ప్రజల రద్దీ నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

రన్‌వే విస్తరణ మరియు ×ూా వ్యవస్థ ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే ఎమర్జెన్సీ యాక్సెస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు.

ప్రస్తుతం హైదరాబాద్‌కు రోజువారీ, చెన్నై మరియు విజయవాడకు ప్రత్యామ్నాయ రోజుల్లో విమాన సర్వీసులు నడుస్తున్నాయని, కొత్త టెర్మినల్ ప్రారంభం తర్వాత మరిన్ని విమాన మార్గాలను ప్రారంభించేందుకు ఎయిర్‌లైన్స్‌తో చర్చలు జరుగుతున్నాయన్నారు.

అదేవిధంగా, ఎయిర్‌పోర్ట్ భద్రతకు ముప్పు కలిగించే అడవి జంతువులను తొలగించేందుకు అటవీ శాఖతో కలిసి చర్యలు చేపట్టాలని సూచించారు. ఀూా× భూముల మ్యుటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఎయిర్‌పోర్ట్ భద్రతా అంశాల్లో హైజాక్ వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఏ పరిస్థితిలోనైనా వెంటనే స్పందించేలా కంటెంజెన్సీ ప్రణాళికలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఏరో డ్రమ్‌లో భద్రతా వాహనాల ఏర్పాటు కోసం రెవెన్యూ, కడప మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు శాఖల సమన్వయ నిర్ణయంతో ముందుకు సాగడం జరుగుతుందన్నారు. ఎయిర్ పోర్ట్ పరిసరాలను స్వచ్ఛంగా, పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంలో కడప మున్సిపల్ కమిషనర్, పంచాయతీ రాజ్ శాఖలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పొదార్, ఏయిర్ పోర్ట్ డిజిఎం లు రాజేశ్వర్, తిరుమల మురగన్, ఆపరేషన్ ఇంచార్జ్ దామోదర్, సభ్యులు, పోలీసు, రెవెన్యూ, సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణ

### మే 2న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సభలు: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 30: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణలో భాగంగా, తేదీ: 02-05-2026న జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సభల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "ప్రజా పాలన అంటే ప్రజల వద్దకే పాలన. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో సభలు నిర్వహించి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, సత్వర పరిష్కారం చూపడమే మన లక్ష్యం" అని తెలిపారు.

"సభలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. అర్జీల స్వీకరణ, పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి. తాగునీరు, నీడ, వైద్య సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి" అని అధికారులకు సూచించారు.ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మదన్ మోహన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి , సిపిఓ రఘునందన్ పాల్గొన్నారు.

## శ్రీకరి జ్యువెలర్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

### రిబ్బన్ కట్ చేసి చలివేంద్రం ప్రారంభించిన ఏఎస్ఐ ఆండాలు

మెదక్ జిల్లా, ఏప్రిల్ 30 (భారత శక్తి న్యూస్):

పాన్ బ్రోకర్స్ ఆధ్వర్యంలో కౌడిపల్లి స్థానిక ఏఎస్ఐ ఆండాలు చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. గురువారం సంత కావడంతో సంతకు వచ్చిన ప్రజలకు చల్లని నీరు మజ్జిగ అందించారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ రోజురోజుకు ఎండల ఉష్ణోగ్రత పెరుగుతున్న నేపథ్యంలో శ్రీకరి జ్యువెలర్స్ యజమాని నాగరాజు చారి, ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహాన్ని తీర్చడం గర్వించదగ్గ విషయం అన్నారు.కొన్ని ఏళ్ల క్రితం వేసవికాలం వచ్చిందంటే చాలు ఎందరెందరో దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహం తీర్చడానికి ముందుకొచ్చే వారన్నారు. ప్రస్తుతం హోటల్ కి వెళ్లి గ్లాసెడు నీళ్లు తాగాలన్న 20 రూపాయలు బాటిల్ కొని తాగాలంటున్న యజమానులు ఉన్నారు. త్రాగే నీటితో కూడా వ్యాపారం చేస్తూన్నారు అన్నారు. ఇలాంటి సమయంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహం తీరుస్తున్నందుకు




నాగరాజు చారిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు కొందరు దాతలు ముందుకు వచ్చి నిర్వహించడం ద్వారా ప్రజలకు మంచి చేసినవారు అవుతారని అన్నారు

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో జహీర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజీవ్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పోల నవీన్, చంద్రం వెంకట్ గౌడ్, ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండి కొండోజు నరసింహ చారి, గ్రామ పెద్దలు పునరీకం గౌడ్, సత్యనారాయణ గౌడ్, జగన్,మాసన్న. హరీష్, గుడ్డంల రాజశేఖర్, శ్రీకాంత్ గౌడ్, తోపాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో వైభవంగా నృసింహ జయంతి వేడుకలు

జగిత్యాల, ఏప్రిల్ 30 (భారతశక్తి ప్రతినిధి):

ధర్మపురి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నృసింహ నవరాత్రోత్సవములు గత తొమ్మిది రోజులుగా వైభవంగా నిర్వహించడం జరుగుతుంది చివరి రోజైన గురువారం రోజున నృసింహ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పురుష సూక్తం, శ్రీ సూక్తం, కల్పోక్త విధానాలు, సహస్ర నామార్చన, పంచోపనిషత్తుల పారాయణంతో స్వామివారి అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్థంబోద్భవ కాలమున విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్, ఆలయ కార్యనిర్వాణా అధికార సంకటాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసచార్యులు, నంబి మూర్తి, అరుణ్, రమణయ్య, అశ్విన్,



విజయ్,వంశీ, కిరణ్, కార్తీక్ మరియు వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, అభిషేక పురోహితులు బొజ్జ సంపత్, సంతోష్, రాజగోపాల్ మరియు భక్తులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టియూడబ్ల్యూజే ( ఐజేయూ ) యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి : యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు

### - మే 15న జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపు

ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (భారత శక్తి): టి యు డబ్ల్యూ జే (ఐ జే యూ ) యూనియన్ బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లాగోవిందరావుపేట మండలం బుస్సాపూర్ సమీపంలోని "విరించి " రిసార్ట్ లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండి షఫీ అహ్మద్, కార్యదర్శి చిదురాల వాసుదేవ్ ల అధ్యక్షతన యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మండలంలో ఐజేయూ సంఘం సభ్యుల సంఖ్య ఎక్కువ మొత్తంలో ఉండే విధంగా నాయకులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. యూనియన్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ములుగు జిల్లా ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. సంఘం సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ రాష్ట్ర నాయకత్వం నిరంతరం శ్రమిస్తుందని అన్నారు. మే 15న ములుగు జిల్లా కేంద్రంలో ఐజేయు మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక నాయకత్వానికి ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి సంఘం సభ్యులను అధిక సంఖ్యలో తరలించి మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇట్టి మహాసభ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర నాయకత్వం తో పాటు ప్రెస్ అకాడమీ చైర్మన్ హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. స్థానిక



ఐజయు నాయకత్వం కలిసికట్టుగా మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పలు అంశాలపై ఆయన స్థానిక యూనియన్ నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో ఐజేయు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎనగందుల కొమురయ్య జిల్లా ఉపాధ్యక్షులు భేతి సతీష్ యాదవ్. గంపల శివ సంయుక్త కార్యదర్శి చుంచు రమేష్. గూగుల మోడీ హరికృష్ణ కోశాధికారి బైకానీ నటరాజ్. దాడుల వ్యతిరేక కన్వీనర్ జాలిగం శ్రీనివాస్ చిన్న పత్రికల ప్రధాన కార్యదర్శి. ఎనుగందుల. శంకర్. జింకల ప్రభాకర్. గోల్కొండ రాజు.ముంద్రాతి ప్రతాప్. కుదురుపాక ప్రవీణ్ అశోక్. పతంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## డిజిటల్ జనగణనకు ములుగు జిల్లా సిద్ధం : జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు

**- స్వీయ నమోదు ఖచ్చితమైన సమాచారం -- ప్రజలు సహకరించాలి**

**- ప్రభుత్వం-ప్రజలకు వారధిగా మీడియా పాత్ర కీలకం**

ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (భారత శక్తి) :జిల్లాలో జన గణనను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.



జిల్లా కేంద్రంలో కలెక్టరెట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జనగణన పై కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా స్వీయ నమోదు ద్వారా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని ప్రజలను కోరారు.జన గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశ హౌస్ లిస్టింగ్ లో స్వీయ గణన ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 807 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించామని, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 జనాభా ఉంటుందని వివరించారు. ఈ ప్రక్రియ కోసం 545 మందిఎన్యూమరేటర్లు, 97 మంది సూపర్వైజర్లను (రిజర్వ్‌తో సహా) నియమించామని చెప్పారు. స్వీయ నమోదు కోసం ఒవ.ఱవఅంబం.స్త్రశీఙ.అఅ పోర్టల్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని, ఒకసారి నమోదు చేసిన తరువాత సవరణకు అవకాశం ఉండదని సూచించారు. నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు 11 అంకెల సంఖ్య వస్తుందని, ఆ సంఖ్యను ఎన్యుమరేటర్‌కు అందజేయాలని తెలిపారు.ఏవైనా తప్పులు ఉంటే ఎన్యుమరేటర్ ద్వారా మాత్రమే సవరించుకోవచ్చని స్పష్టం చేశారు. డిజిటల్ విధానంలో జరుగుతున్న ఈ జనగణనలో డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని, స్వీయ నమోదు ద్వారా వేగవంతంగా, ఖచ్చితమైన డేటా సేకరణ సాధ్యమవుతుందని చెప్పారు.

జన గణన 2027 కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, స్వీయ నమోదు చివరి తేదీ మే 10 అని తెలిపారు. సాధారణంగా నివసించే ప్రదేశంలోనే ప్రజలు నమోదు కావాలని సూచించారు.ప్రభుత్వం, ప్రజల మధ్య మీడియా వారధిగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు.ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ సి. హెచ్. మహేందర్ జి, డి పి ఆర్ ఓ రఫిక్, కలెక్టరేట్ జనగణన పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు సైకిళ్లు పంపిణీ చేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 30 :



సంగారెడ్డి పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 62 మంది చిన్నారులకు జగ్గారెడ్డి ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తమ కార్యాలయంలో పేర్లను నమోదు చేయించుకున్న విద్యార్థులకు విడతల వారీగా సైకిళ్లు అందిస్తున్నామని వివరించారు. సైకిళ్ళ పంపిణీ సందర్భంగా చిన్నారులతో జగ్గారెడ్డి ముచ్చటించారు. తాము ఇంటి నుంచి పాఠశాలకు పోయి వచ్చేందుకు ఈ సైకిళ్ళు కావాలని అడిగినట్లు విద్యార్థులు జగ్గారెడ్డికి వివరించారు. 25మంది బాలికలు, 37 మంది బాలురకు సైకిల్స్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేర్యాల ఆంజనేయులు, జార్జ్ మాథ్యూస్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీకాంత్, మహేష్ ముదిరాజ్, రాజు, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధ పూర్ణిమ -- కరుణా పరిపూర్ణత : భారత ఉపరాష్ట్రపతి,సీపీ రాధాకృష్ణన్

చిత్ర పూర్ణిమ పవిత్ర పర్వదినం సందర్భంగా, ఆలయాల్లో వేడుకలు జరుగుతున్న ఈ శుభవేళ, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు వర్ధిల్లాలని కోరుకుంటున్నాను. ఈ సందర్భంగా నా సోదర సోదరీమణులందరికీ బుద్ధ పూర్ణిమ శుభాకాంక్షలు తెలియజేయడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. ప్రపంచానికి భారతదేశం అందించిన ఎన్నో గొప్ప కానుకల్లో బౌద్ధం అత్యంత ప్రధానమైనది. గౌతమ బుద్ధుని జీవితం, ఆయన బోధనలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి.

నిజమైన ఆత్మ సాక్షాత్కారం ఎంత ముఖ్యమో భారతదేశం ప్రపంచానికి చాటిచెప్పింది. "బుద్ధుడు" అంటేనే "మేల్కొన్నవాడు" అని అర్థం. మానవాళిని చైతన్యం వైపు నడిపించేందుకు కృషి చేసిన ఆ మహాత్ముని జననం, జ్ఞానోదయం ఒకే రోజున సంభవించడం విశేషం.

రాకుమారుడు సిద్ధార్థ సకల రాజభోగాల మధ్య పెరిగారు. కానీ, తన 29వ ఏట రాజప్రాసాదాన్ని, భార్యాబిడ్డలను, సమస్త సంపదలను వదిలి ఆధ్యాత్మిక సత్యం కోసం బయలుదేరారు. ఆరేళ్ల కఠిన శ్రమ, అన్వేషణ తర్వాత బుద్ధగయలోని బోధి వృక్షం కింద ఆయనకు జ్ఞానోదయం కలిగింది. అలా సిద్ధార్థుడు 'బుద్ధుడిగా' మారారు.


ఆయన కనుగొన్న నాలుగు ఆర్య సత్యాలు, నైతిక ప్రవర్తనతో కూడిన జీవన మార్గం ఒక సరికొత్త జీవన తత్వానికి పునాది వేశాయి. ఇది ప్రపంచ చరిత్రలో భారతదేశానికి ఒక ప్రత్యేక గుర్తింపును, గర్వకారణాన్ని తెచ్చిపెట్టింది.

వారణాసి సమీపంలోని సారనాథ్‌లో బుద్ధుడు తన ఐదుగురు శిష్యులకు (సన్యాసులకు) మొదటి బోధన చేశారు. దీనినే "ధర్మచక్ర పరివర్తన" అంటారు. ఈ బోధనే బౌద్ధమతానికి పునాదిగా మారి, ప్రపంచవ్యాప్తంగా ఈ ధర్మం విస్తరించడానికి నాంది పలికింది.

కాలక్రమేణా, బుద్ధుని బోధనలకు ఆకర్షితులై ఎంతోమంది ఆయన వైపు మళ్లారు. మగధ రాజైన బింబిసారుడు రాజగీర్‌లోని 'వేణువనం' అనే మఠాన్ని దానంగా ఇచ్చారు. అలాగే, అనాథపిండికుడు అనే సంపన్న వ్యాపారి 'జేతవనం' అనే తోటను కొనుగోలు చేయడానికి, ఆ నేల మొత్తాన్ని బంగారు నాణేలతో పరిచి మరీ ఆశ్రమాన్ని నిర్మించారు. ఇవన్నీ ఆనాడు భారతదేశంలో ధర్మం పట్ల ప్రజలకు ఉన్న ప్రగాఢ విశ్వాసానికి నిదర్శనాలు.

ఈ మఠాలు బుద్ధుడు బోధించిన నాలుగు ఆర్య సత్యాలను విస్తృతంగా ప్రచారం చేశాయి: కోరికలే దుఃఖానికి మూలకారణం, కోరికలను తొలగించడం ద్వారానే దుఃఖాన్ని జయించవచ్చు, అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా దుఃఖం లేని విముక్త జీవితాన్ని గడపవచ్చు

అలాగే.. బుద్ధుడు ఇలా హితవు పలికారు: గతంలో



కూరుకుపోవద్దు---ప్రస్తుతంలో జీవించు. సత్యం చాలా శక్తివంతమైనది. మనసే అన్ని పనులకు మూలస్థానం, అందుకే ఎప్పుడూ సానుకూల ఆలోచనలనే పెంచుకో. కష్టకాలంలో భయపడి వెనుకడుగు వేయవద్దు. జీవిత ప్రయాణం చివరకు ఒంటరిదే---దానిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపించు. మాటలు గాయపరుస్తాయి, అందుకే మృదువుగా మాట్లాడు. ప్రేమ, అహింస అనేవి జీవితానికి అత్యంత అవసరం. నేర్చుకోవడం ఎప్పుడూ ఆపకు---నిరంతరం నేర్చుకుంటూనే ఉండు.

మణిమేఖలై, కుండలకేసి వంటి తమిళ సాహిత్య గ్రంథాలు బౌద్ధ తత్వాన్ని ఎంతో అందంగా చాటిచెప్పాయి. అనేక గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ, అవి అందించిన జ్ఞానం మాత్రం వెలకట్టలేనిది.

"మతిని మసకబార్చే మత్తు పానీయాలు, ప్రాణాలను తీయడం వంటి పనులను... మోహం లేని విజ్ఞులు ఎప్పుడో వదిలిపెట్టారు, వినండి: జనన మరణాలు, మళ్లీ మరణం తర్వాత జన్మించడం అనేవి కేవలం నిద్రపోవడం, మేల్కొనడం వంటివి---ఇదే సత్యం. పుణ్యకార్యాలు చేసేవారు ఉన్నతమైన లోకాన్ని పొందుతారు, చెడు పనులు చేసేవారు తీవ్రమైన దుఃఖంలో కూరుకుపోతారు. ఈ నిజాన్ని గ్రహించి, విజ్ఞులైన వారు తమ బంధాలను తెంచుకున్నారు." తమిళ మహాకావ్యం మణిమేఖలై (ఆత్తిరై పిచ్చైయిట్ట కాదై: 84--90) బౌద్ధ ధర్మం యొక్క సారాంశాన్ని ఈ విధంగా ఎంతో అర్థవంతంగా వివరించింది.

నవ వఎజూష్టుంఅఓవస టఅజవ ఎశీతీఖ్రీ జూతీవ- ఎవజూ్ం: అశీఅ-జఅశీశ్రీవఅఎవ, అశీఅ-ర్మఖశ్రీఅఅస్త్ర, తీవ- టతీఖఅఅఅస్త్ర టతీశీఎ ఖఎబశ్రీవతీఎ,¯తీబ్ష్ట్రటబశ్రీఅవం, ఖఅస ఖఎర్ఖఅఅఅస్త్ర టతీశీఎ అతీశీఇఅఖ్ఖత్ం. దీవఎశీఅస తీవశ్రీఅస్త్రఅశీఅ, ష్ట్రవ్ఖబస్త్రష్ట్ర్ ష్ట్రూ్ ష్ట్రవ ఎఅఅస అర్ ష్ట్రవ తీశీశీ శీట వజవతీవ్ష్ట్రఅఅస్త్ర---జూశీంత్అజవ్ష్ట్రశీబస్త్రష్ట్రం ఖఅస ఖ్ఎఅశీఅం శ్రీమ్ఖన్శీ ఖ ష్ట్రుతీఎశీఅఅశీబం శ్రీఅటవ ఖఅస ంశీఎఅవ్ఎ. దీవఖ్ఖబంవ ష్ట్రవ ఎతీశీబస్త్రష్ట్ర ఎశ్రీఖతీత్ఎ ఖఅస వఅశ్రీఅస్త్రష్ట్రవఅఎవత్¯శ్¯తీశీబఎశ్రీవస ఎఅఅసం, ష్ట్రవ అం ఎవశ్రీవఎతీఖ్వస ఖర్ష్ట్రవ "హఅస్త్రష్ట్ర శీట ాాంఖు."

బుద్ధుడు ఐదు ముఖ్యమైన నైతిక సూత్రాలను (పంచశీల) బోధించారు : అవి అహింస, దొంగతనం చేయకపోవడం, వ్యభిచారానికి దూరంగా ఉండటం, సత్యం పలకడం మరియు మత్తు పానీయాలకు దూరంగా ఉండటం. మతానికి అతీతంగా, మనసే అన్నింటికీ మూలమని ఆయన బోధించారు---సానుకూల ఆలోచనలు, పనులే ప్రశాంతమైన జీవితానికి, సామరస్యపూర్వకమైన సమాజానికి దారితీస్తాయని చెప్పారు. కలత చెందిన మనసులకు స్పష్టతను, జ్ఞానోదయాన్ని అందించినందుకే ఆయనను "లైట్ ఆఫ్ ఆసియా" గా కొనియాడతారు.

ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో చెప్పిన మాటలు ఈ సందర్భంగా నాకు గుర్తున్నాయి: "భగవాన్ గౌతమ బుద్ధుని జీవిత సందేశం నేటికీ ఎంతో సందర్భోచితంగా ఉంది. శాంతి అనేది మన నుంచే మొదలవుతుందని ఆయన మనకు నేర్పారు; తనను తాను జయించడమే అన్నిటికంటే గొప్ప విజయమని మనకు గుర్తుచేశారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఉద్రిక్తతలు, ఘర్షణల మధ్య బుద్ధుని బోధనలు మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి."

బుద్ధుని బోధనలకు ఉన్న మార్చే శక్తి ఎంతటిదో చక్రవర్తి అశోకుని జీవితమే ఒక నిదర్శనం. యుద్ధమే పరమావధిగా బతికే పాలకుడిని శాంతి కాముకుడిగా ఈ బోధనలే మార్చేశాయి. అశోక చక్రవర్తి దేశవ్యాప్తంగా శాసనాలు, స్తూపాలను నిర్మించి బౌద్ధ సూత్రాలను ప్రచారం చేశారు. సాంచి, సారనాథ్ లోని స్తూపాలు నేటికీ ప్రపంచ నలుమూలల నుంచి ప్రజలను ఆకర్షిస్తున్నాయి. సారనాథ్ లోని 'సింహ తలల స్తంభం' ప్రస్తుతం మన భారత జాతీయ చిహ్నంగా గౌరవించబడుతోంది.

అశోకుడు తన కుటుంబ సభ్యులతో పాటు బౌద్ధ సన్యాసులను ఆసియా అంతటా పంపి బౌద్ధాన్ని వ్యాపింపజేశారు. 'మహావంశం' గ్రంథంలో పేర్కొన్నట్లుగా, ఆయన కుమారుడు మహేంద్రుడు శ్రీలంకకు వెళ్లి బుద్ధుని బోధనలను ప్రచారం చేశారు. బౌద్ధ సన్యాసుల కృషి వల్ల తమిళనాడులో కూడా ఈ ధర్మం విస్తరించిందని భావిస్తారు; దీనికి నిదర్శనంగా ఇప్పటికీ ఆ ప్రాంతాల్లో అనేక బౌద్ధ ఆనవాళ్లు కనిపిస్తాయి.

బౌద్ధ సన్యాసులు ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ ఉచిత వైద్య సేవలను, విద్యను అందించారు. వారు త్రిపిటక వంటి పవిత్ర గ్రంథాలను బోధించడంతో పాటు, జాతక కథలను ప్రజలకు వివరించేవారు. అంతేకాకుండా, ప్రజల్లో చైతన్యాన్ని నింపడానికి ధ్యాన ప్రక్రియలలో వారికి మార్గనిర్దేశం చేసేవారు.

దానధర్మం, ముఖ్యంగా పేదలకు అన్నదానం చేయడం అనేది ఒక ప్రాథమిక విధిగా పరిగణించబడేది. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అంటే వారికి ప్రాణదానం చేయడమేనని తమిళ సాహిత్యం చాటిచెప్పింది.

వేల సంవత్సరాలుగా, ఈ గడ్డపై ఎన్నో రకాల ఆధ్యాత్మిక చింతనలు, విభిన్న తత్వాలు విరాజిల్లాయి, అభివృద్ధి చెందాయి. అది బౌద్ధమైనా లేదా జైనమైనా... ఏ మతాన్నైనా భారతదేశం అంతటా ఒకే స్ఫూర్తితో స్వీకరించారు. ఇది మన దేశం సాంస్కృతిక పరంగా, భావాల పరంగా ఎప్పుడూ ఏకతాటిపైనే ఉందని నిరూపిస్తుంది.

నిరంతర అభ్యాసానికి ప్రాధాన్యతనిచ్చే బౌద్ధం, విద్యా సంస్థలను, గ్రంథాలయాలను భారీ స్థాయిలో స్థాపించింది. 5వ శతాబ్దం నాటికే నలంద విశ్వవిద్యాలయం సుమారు 10,000 మంది విద్యార్థులు, 1,500 మంది ఉపాధ్యాయులతో ఒక గొప్ప విద్యా కేంద్రంగా విరాజిల్లింది.

నలంద తరహాలోనే, తమిళనాడులోని కాంచీపురంలో కూడా ఒక ప్రసిద్ధ విశ్వవిద్యాలయం ఉండేదని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. విక్రమశిల, ఓదంతపురి వంటి విశ్వవిద్యాలయాలతో పాటు, అప్పట్లో వెలువడిన అనేక సాహిత్య గ్రంథాలు మన దేశ మేధో సంపత్తిని ప్రపంచానికి చాటిచెప్పాయి.

ఆసియా నలుమూలల నుంచి పండితులు ఈ బౌద్ధ పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకోవడానికి వచ్చేవారు. చైనా యాత్రికుడు ఫాహియాన్ తన 15 ఏళ్ల సుదీర్ఘ తీర్థయాత్రను ప్రత్యేకంగా బౌద్ధం కోసమే చేపట్టారు. మరో చైనా యాత్రికుడు హువాన్‌త్సాంగ్ కూడా 16 ఏళ్ల పాటు భారతదేశంలో ఉండి, నలందలో విద్యాభ్యాసం చేసి, అనేక బౌద్ధ గ్రంథాలను సేకరించి తన దేశానికి తిరిగి వెళ్లారు.

హువాన్‌త్సాంగ్ తన వివరణాత్మక యాత్రా కథనాల్లో పేర్కొన్న ప్రకారం.. ఆయన తమిళనాడులోని కాంచీపురాన్ని కూడా సందర్శించారు. అక్కడ ఒక బౌద్ధ విశ్వవిద్యాలయంలో ఉండి విద్యాభ్యాసం చేయడమే కాకుండా, తాళపత్ర గ్రంథాలను నకలు చేసుకున్నారు. అక్కడి విద్యార్థులకు ఆయన ప్రత్యేక ఉపన్యాసాలు కూడా ఇచ్చారని చెబుతుంటారు.

కఠినమైన తపస్సు వల్ల నీరసించిపోయిన బుద్ధునిపై జాలితో, సుజాత అనే మహిళ ఎంతో ప్రేమతో ఆయనకు పాలు, అన్నంతో చేసిన పరమాన్నాన్ని (పాయసం) తినిపించింది. ఇది బుద్ధునికి ప్రాణదానం చేయడమే కాకుండా, బోధి వృక్షం కింద ధ్యానం చేయడానికి అవసరమైన శక్తిని అందించింది. అందుకే బుద్ధ పూర్ణిమ రోజున ఆమె ప్రేమను, కరుణను స్మరించుకుంటూ పాయసాన్ని నైవేద్యంగా సమర్పించడం ఒక ఆచారంగా వస్తోంది.

ప్రేమే సంతోషానికి మూలం, ప్రేమే ప్రపంచానికి వెలుగు, ప్రేమే అత్యంత గొప్ప శక్తి"---బుద్ధుడి ఈ బోధనలు నేటికీ ఎంతో సందర్భోచితంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రేమానురాగాలు, శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# బిఆర్ఎస్ నేతలు చేసిన అవినీతి ఆరోపణలలో వాస్తవం లేదు

జగిత్యాల,ఏప్రిల్ 30 ( భారత శక్తి ప్రతినిధి ):

ధర్మపురి మండల కాంగ్రెస్ నాయకులు గురువారం రోజున క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం పై చేసిన ఆరోపణలపై తీవ్రంగా మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశంలో అవగాహన లేని మాటలు మాట్లాడారని, ఆధారాల్లేని ఆరోపణలు చేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజు, మాజీ పీఏసీఎస్ జైన చైర్మన్ నరేష్,పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం లో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ గడిచిన రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి పట్టణ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృషి చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా ధర్మపురి పట్టణ ప్రజలకు తాగు నీటిని అందించడం పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం గా ఉన్న ధర్మపురిని టెంపుల్ సిటీగా మార్చి ధర్మపురి క్షేత్ర విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పే ఒక మహత్తరమైన యజ్ఞానికి మంత్రి శ్రీకారం చుట్టారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆలయ అభివృద్ధి పై చేసిన ఆరోపణలను వారు తిప్పి కొట్టారు. ఆలయ విస్తరణ కోసం భూసేకరణ ప్రక్రియ చేపట్టగా కొందరు కోర్టును ఆశ్రయించారని అన్నారు. కోర్టు వివాదాన్ని పరిష్కరించి భూ నిర్వాసితులను ఒప్పించి ఆలయ అభివృద్ధికి ముందుకు సాగుతున్నారని దినేష్ వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇప్పటివరకు ఎవరిని బెదిరించలేదని వివరించారు.

ఆలయ అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వ కాలంలో భూమిని సేకరిస్తున్న లబ్ధిదారులకు తెలవకుండానే వ్యవసాయ భూములతో పాటు ఇంటి స్థలాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బ్లాక్ చేసి ఉంచారని దినేష్ గుర్తు చేశారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి కొరకు సేకరిస్తున్న భూ యజమానులతో మంత్రి ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపారని ఎలాంటి బలవంతం లేకుండా శాంతి యుతంగా, చట్టపరంగా భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తుందని దినేష్ వివరించారు.

గతంలో ప్రజా ప్రతినిధిగా పనిచేసిన బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోవడంతో అసహనంతో అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల రాజు అన్నారు. శనివారం సంతకు సంబంధించి గతంలో మూడున్నర లక్షలకు వేలం పాడిన ఒక వ్యక్తి మార్చి 31 తో గడువు ముగిసినప్పటికీ మరో రెండున్నర లక్షల రూపాయలు ధర్మపురి మున్సిపాలిటికీ బాకీ ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపల్ కు బాకీ ఉన్న వ్యక్తులను పక్కన



పెట్టుకొని తప్పుడు ఆరోపణ చేస్తున్నారని రాజు విమర్శించారు. ఒక ప్రజా ప్రతినిధిగా పనిచేసిన వ్యక్తి సోషల్ మీడియాలో వచ్చిందట, వారు అంటున్నారు, వీరు అంటున్నారు అంటూ ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని రాజు అన్నారు.

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుంది హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పిన నాయకుల తీరును మార్పు రావడంలేదని రాజు విమర్శించారు.

సింగల్ విండో మాజీ చైర్మన్ నరేష్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ భూములను పట్టాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన చరిత్ర బీఆర్ ఎస్ నాయకులదని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో దాన్యం కొనుగోలు లో అక్రమాలు జరుగుతున్నాయని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ధాన్యం కొనుగోలు లో అక్రమాలు జరిగాయని రైతులు ఎవరైనా ఫిర్యాదు చేశారని ప్రశ్నించారు. శ్రీకాంత్ రెడ్డి డిసిసి అధ్యక్షులుగా ఉన్న సమయంలో తన సొంత గ్రామం రైతులు ధాన్యాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పోసి నిరసన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని నరేష్ అన్నారు. లేకుంటే శ్రీకాంత్ రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డారని నరేష్ ఆరోపించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ

## లక్ష్మీబ్యారేజి,అన్నారం సరస్వతి బ్యారేజీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 30 (భారత శక్తి) మేడిగడ్డ లో కొనసాగుతున్న బోర్ హోల్స్ పనుల పురోగతిని అధికారులను గురువారం అడిగితెలుసుకున్నారు.మేడిగడ్డ,అన్నారం ప్రాజెక్ట్ ల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. సిబ్బంది కోసం గతంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ఉపయోగించిన షెడ్లను పరిశీలించి సిబ్బంది ఉండేందుకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం అన్నారంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద అదనపు సిబ్బంది వసతి కొరకు గదులను పరిశీలించారు.అన్నారం ప్రాజెక్ట్ అవ్ స్ట్రీమ్ ను పరిశీలించి బోర్ హోల్స్ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రాజెక్టులో సాంకేతిక పరిశీలన పనులను శుక్రవారం నుంచి ప్రారంభించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక పరీక్షలను దశల వారీగా చేపట్టాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పరిశీలన పనుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు.డ్రిల్లింగ్ పనులు చేపట్టేటప్పుడు గట్టి శిలా పొర వచ్చేంతవరకు కొనసాగించాలని సూచించారు. ప్రాజెక్టులో వివిధ దశల్లో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తూ పనుల నాణ్యతను నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ సరఫరాను నిరంతరం అందుబాటులో ఉంచాలని, ప్రతిరోజు ఇరిగేషన్ అధికారులు పనులను సమగ్రంగా పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఈఎన్సి రమేష్ కుమార్, సీఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈలు తిరుపతిరావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 30: జిల్లాలో నిర్మాణంలో నిలిచిపోయిన అంగన్వాడీ భవనాల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, డీఈపీఆర్ఓ, డిడబ్ల్యూఓ, సీడీపీఓలు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు త్వరితగతిన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడెక్కడ నిర్మాణ అవసరాలు ఉన్నాయో గుర్తించి, అక్కడ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని సూచించారు.అలాగే పెండింగ్‌లో ఉన్న అన్ని నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి అంగన్వాడీ కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.

సినిమా

10 ఏళ్ల క్రితం సినిమా..

# రిలీజ్‌కు ఎట్టకేలకు మార్గం సుగమం



విక్రమ్ హీరోగా నటించిన 'ధ్రువనక్షత్రం' సినిమా విడుదలకు ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. ఈ మూవీ రిలీజ్‌కు మద్రాస్ హైకోర్టు అనుమతి ఇచ్చింది. జూన్ 15 లేదా అంతకన్నా ముందు విడుదలకు వీలు కల్పించింది. 'కొండాడువోమ్ ఎంటర్‌టైన్‌మెంట్' పేరిట బ్యాంకు ఖాతాను తెరవాలని, ఇకపై దీని ద్వారానే ఈ సినిమాకి సంబంధించిన ట్రాన్సాక్షన్స్ జరగాలని ఆదేశించింది. ఓ న్యాయవాది దీనిని పర్యవేక్షిస్తారని తెలిపింది. ఎంత ప్రయత్నించినా జూన్ 15లోగా విడుదల చేయడం సాధ్యంకాకపోతే.. కోర్టును సంప్రదించి, సమయం కోరవచ్చని చెప్పింది. 2016లో ప్రారంభమైన ఈ చిత్రాన్ని 2017లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు దర్శకుడు గౌతమ్ మేనన్. కానీ, ఆర్థిక సమస్యల కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. 2023లో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. శింబు హీరోగా గౌతమ్ మేనన్ ఓ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ఒప్పందం కుదుర్చుకుని, ఆ మేరకు రూ.2.40 కోట్లు తీసుకున్నారని, కానీ ఆయన సినిమాని పూర్తి చేయలేదని.. డబ్బు తిరిగి ఇవ్వలేదని ఆల్ ఇన్ పిక్చర్స్ సంస్థ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. నగదు తిరిగి ఇవ్వకుండా 'ధృవ నక్షత్రం' సినిమా విడుదల చేసేందుకు నిషేధం విధించాలని కోరింది. అలా మళ్లీ పోస్ట్‌పోన్ అవుతూనే వచ్చింది.




కందుల సులోచనగా అనుపమ..

# 'భోగి' లుక్ రిలీజ్

శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో 'భోగి' సినిమా రానున్న విషయం తెలిసిందే. ఇందులో శర్వాకు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు. నేడు అనుపమ పాత్ర పేరును వెల్లడిస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్ పంచుకున్నారు. ఇందులో ఆమె 'కందుల సులోచన రాణి'గా కనిపించనున్నారు. 'ప్రకృతి బిడ్డ.. గంగమ్మ నిలయం.. కందుల వారి గర్వం.. భోగి చిత్రానికి ఆమె ప్రాణం' అంటూ అనుపమ పోస్టర్‌ను దర్శకుడు పంచుకున్నారు. 1960 నేపథ్యంలో సాగే కథతో రూపొందుతోన్న ఈ సినిమా ఆగస్టు 28న విడుదల కానుంది. ఉత్తర తెలంగాణ - మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ కథని పాన్ ఇండియా స్థాయిలో తెర పైకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే పలు షెడ్యూళ్లు పూర్తి చేసుకుంది. ఇటీవల విడుదల చేసిన దీని కాన్సెప్ట్ వీడియోకు ఆదరణ సొంతమైంది. భారీస్థాయిలో ఈ సినిమా రానుంది. దర్శకుడి విజన్‌కి ప్రాణం పోయడం కోసం ప్రొడక్షన్ బృందం 20 ఎకరాల్లో, ఆరు నెలల పాటు శ్రమించి సెట్‌ని తీర్చిదిద్దింది.



# సీవీ ఆనంద్‌కు చిరంజీవి శుభాకాంక్షలు

తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్‌కు అగ్ర కథానాయకుడు చిరంజీవి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆనంద్ నాయకత్వంపై తనకున్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ''తెలంగాణ డీజీపీగా నియమితులైనందుకు సీవీ ఆనంద్‌కి నా హృదయపూర్వక అభినందనలు. అత్యంత కీలకమైన బాధ్యత ఇప్పుడు మీ భుజస్కంధాలపై ఉంది. మీ అంకితభావం, చిత్తశుద్ధితో ఈ బాధ్యతను మీరు ఉన్నతంగా నిర్వర్తిస్తారని నాకు నమ్మకం ఉంది. ఈ కొత్త బాధ్యతల నిర్వహణలో మీరు మరెన్నో విజయాలు సాధించాలని కోరుకుంటున్నా'' అంటూ సీవీ ఆనంద్‌తో ఉన్న ఫొటోను చిరు పంచుకున్నారు.

అందంగా ఉంటే సరిపోదు..

ప్రియాంక పై

# కొరియోగ్రాఫర్ ఫైర్

'రామ్‌లీలా'లో వైట్ డ్రెస్‌లో 'రామ్ చాహే లీలా' అంటూ ప్రియాంక చోప్రా చేసిన డ్యాన్స్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. 'దోస్తానా'లో దేశీ గర్ల్ అంటూ స్టెప్‌లతో అదరగొట్టారు. అంత గొప్పగా డ్యాన్స్ వేసే ప్రియాంక కెరీర్ ఆరంభంలో మాత్రం ఈ విషయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన అనుభవాన్ని పంచుకున్నారు. కొరియోగ్రాఫర్ రాజు ఖాన్ తనపై అందరిముందే కోప్పడ్డారని తెలిపారు. ''నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో డ్యాన్స్ విషయంలో చాలా ఇబ్బందిపడ్డాను. ఒకవైపు స్టెప్స్ వేస్తూ.. కళ్లతో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడం కష్టంగా అనిపించేది. వీటితో పాటు నా పక్కన కోస్టార్‌కు మ్యాచ్ అయ్యేలా స్టెప్స్ వేయడం అసాధ్యంలా అనిపించేది. ఒకేసారి ఇన్ని పనులు ఎలా చేయాలని కంగారుగా ఉండేది. సౌత్ ఆఫ్రికాలో ఒక పాట చిత్రీకరణ సమయంలో కొరియోగ్రాఫర్ రాజు ఖాన్ నాపై అందరి ముందు అరిచారు. నా డ్యాన్స్‌పై అసహనం వ్యక్తంచేస్తూ మైక్ విసిరేసి అక్కడినుంచి వెళ్లిపోయారు. 'అందంగా ఉంటే సరిపోదు.. నటిగా రాణించాలంటే డ్యాన్స్ కూడా రావాలి. వెళ్లి నేర్చుకుని రా..' అని అరిచారు. దీంతో నేను పట్టుదలతో నేర్చుకున్నా. రోజుకు ఆరు గంటల పాటు కత్రినా కైఫ్‌తో కలిసి ప్రాక్టీస్ చేశా'' అని కెరీర్ తొలినాళ్లను ప్రియాంక గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం ప్రియాంక చోప్రా 'వారణాసి'లో నటిస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ఈ సినిమా రానుంది. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 'వారణాసి' విడుదల కానుంది. 'ఆర్‌ఆర్‌ఆర్'లో నాటు నాటు పాటలాగా.. ఈ సినిమాలో కూడా డ్యాన్స్‌కు అవకాశం ఉండే పాట ఉండాలని తాను రాజమౌళిని రిక్వెస్ట్ చేసినట్లు ప్రియాంక గతంలో తెలిపారు.



'గాయపడ్డ సింహం' గురించి

# వినిపిస్తున్న టాక్ ఇదే!




తరుణ్ భాస్కర్ .. దర్శకుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు. దర్శకుడిగా చిన్నచిన్న సినిమాలు చేస్తూనే, తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్నాడు. ఆ తరువాత దర్శకుడిగా స్పీడ్ తగ్గించిన ఆయన, నటుడిగా ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. కథానాయకుడిగా దూకుడు పెంచుతూ వెళుతున్నాడు. ఆయన హీరోగా చేసిన సినిమానే 'గాయపడ్డ సింహం'. కశ్యప్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, రేపు థియేటర్లలో దిగిపోనుంది. తరుణ్ భాస్కర్ ఈ సారి పూర్తిస్థాయి కామెడీ కంటెంట్ తో చేసిన సినిమా ఇది. మొదటి నుంచి చివరివరకూ ఈ సినిమా నాన్ స్టాప్ కామెడీతో నవ్విస్తుందని అంటున్నారు. కొన్ని హిట్ సినిమాల స్పూఫ్ లు పగలబడి నవ్విస్తాయని అంటున్నారు. ముఖ్యంగా అర్జున్ రెడ్డి .. పోకిరి .. బొమ్మరిల్లు సినిమాలలోని స్పూఫ్ లు తలచుకుని మరీ నవ్వుకునేలా చేస్తాయని చెబుతున్నారు. అలాగే కన్నడ హిట్స్ లోని స్పూఫ్ లు కూడా హైలైట్ గా నిలుస్తాయని అంటున్నారు. తరుణ్ భాస్కర్ సరసన నాయికలుగా ఫరియా అబ్దుల్లా .. మానస చౌదరి అలరించనున్నారు. ఈ ఇద్దరి భామలు కూడా నటనకి మంచి స్కోప్ ఉన్న పాత్రలనే ఈ సినిమాలో చేసినట్టుగా చెబుతున్నారు. ఈ సినిమా తమకి మరింత క్రేజ్ తీసుకొస్తుందనే నమ్మకంతో ఉన్నారు. ఇక ఈ సినిమాలో జేడీ చక్రవర్తి కీలకమైన పాత్రలో కనిపించనున్నాడు. ఆయన పాత్రను డిజైన్ చేసిన విధానం చాలా డిఫరెంట్ గా ఉంటుందట. ఈ పాత్ర చాలా రోజుల పాటు గుర్తుండిపోతుందని చెబుతున్నారు. ఇక శ్రీవిష్ణు అతిథి పాత్రలో సందడి చేయనుండటం మరో విశేషం.

మంజుల మనవరాలు..

# 'అగధ'తో ఎంట్రీ

ఒకప్పటి ప్రముఖ కథానాయిక మంజుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ఆమె మనవరాలు జోవికా విజయ్ కుమార్ వెండితెర అరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు రూపొందిస్తున్న 'అగధ' చిత్రంతో ఆమె నటిగా పరిచయమవుతున్నారు. ఆసక్తికరంగా, జోవికా తల్లి వనిత విజయ్ కుమార్ ను కూడా 'దేవి' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం చేసింది ఎం.ఎస్. రాజే కావడం విశేషం. ఈ సందర్భంగా 'అగధ' చిత్రంలో జోవికా పోషిస్తున్న 'హరిణి' పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. వర్షం కురుస్తున్న పురాతన నేపథ్యంలో, ఆమె కళ్లలో తీక్షణత, అంతర్లీనంగా ఉన్న శక్తిని ప్రదర్శిస్తూ పోస్టర్‌లో ఆకట్టుకున్నారు.



# మహిళల, బాలల భద్రతలో పోలీసు శాఖ ప్రాధాన్యంతో పని చేస్తుంది

- : సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహా ఐ పి ఎస్
- పని ప్రదేశంలో వేదింపులు బరించవద్దు, పిర్యాదు చేయాలి.
- బాల్య వివాహాలను అరికట్టాలి.
- యువత ఆకర్షణలకు గురై భవిష్యత్తును కోల్పోతున్నారు.
- డ్రగ్స్ మత్తులో యువత, విద్యార్థులు జీవితాలు నాశనం చేసుకోవద్దు.
- వేధింపులపై ఫిర్యాదు చేయండి మీ ఇంటి వద్దకు వచ్చి పిర్యాదులు తీసుకుని కేసులు నమోదు చేస్తాము.

సూర్యాపేట (భారత్ శక్తి న్యూస్ ప్రతినిధి) ఏప్రిల్ 30: డ్రగ్స్ తో జీవితం మసి అవుతుంది వాటిని మానేస్తే జీవితం ఖుషి అవుతుంది అని, డ్రగ్స్ మన సమాజాన్ని, మన పిల్లలకు పట్టి పీడిస్తున్న అత్యంత ప్రమాదకరమైన అంశం జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ గారు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా కేంద్రం నందు బాలల భద్రత, మహిళా భద్రత, డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, స్థానిక పౌరులతో కలిసి సూర్యాపేట పట్టణ పోలీసులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నర్సింహ ఐపీఎస్ ప్రారంభించారు. ర్యాలీ జిల్లా కేంద్రంలోని పిఎస్ఆర్ సెంటర్ నుండి పూల సెంటర్ మీదుగా గాంధీ పార్క్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ అనేది అత్యంత ప్రమాదకర స్థాయిలో పాతుకుపోయిందని దీనిని కూకటివేళ్లతో తీసివేయాల్సిన బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్క పౌరునిపై ఉందని అన్నారు. మహిళల భద్రత బాలల భద్రతను పోలీస్ శాఖ పటిష్టంగా కృషి చేస్తుంద ని దీనికోసం షీ టీం సిబ్బంది, భరోసా టీం సిబ్బంది, మానవ అక్రమ రవాణా నిరోధక




బృందాలు శాంతిభద్రతల పోలీసులతో కలిసి పని చేస్తున్నాయని తెలిపారు. మహిళలపై బాలలపై వేధింపులు జరిగిన వాటిని ఉపేక్షించకుండా వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు, 112 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం ఇవ్వాలని పోలీసుల నుండి భద్రత పొందాలని తెలిపారు. ఫిర్యాదులు చేస్తే పోలీసులు మీ ఇంటి వద్దకే వచ్చి, మీరు ఉంటున్న ప్రదేశానికి వచ్చి ఫిర్యాదులు స్వీకరించి అక్కడనే కేసులు నమోదు చేసి కేసు నమోదు పత్రాలు ఎఫ్ఐఆర్ను మీకు అందజేయడం జరుగుతుందని పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని వివరాలు ఉంచుతామని తెలియజేశారు. ఇంటి వద్ద నుండే కేసులు నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్ర పోలీస్ శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎఫ్ఐఆర్ స్టెప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. పని ప్రదేశంలో వేధింపులను నివారించడానికి సంబంధిత శాఖలతో కలిసి పోష్ కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల జీవితం పై అవగాహన కోల్పోయి కుటుంబాలు చిన్నబిన్నం ఆవుతున్నాయని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింకులను అనుసరిస్తూ అత్యాశకు పోయి వ్యక్తిగత వివరాలు నమోదు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారని సైబర్ మోసగాళ్లకు వ్యక్తిగత వివరాలను తెలపకూడదని అన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమం నందు సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, మానవ అక్రమ రవాణా నిరోధక టీం ఇన్స్పెక్టర్ శివకుమార్, పట్టణ ఎస్ఐలు ఐలయ్య, సాయిరాం, ఏడుకొండలు, వెంకన్న, షీ టీం ఎస్సై నీలిమ, భవాని నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, యువత పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఎల్ ఓ సి అందజేత
## అండగా నిలిచిన ఎమ్మెల్యే

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 ( భారత శక్తి ) : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చున్నంబట్టివాడ కు చెందిన లక్ష్మి కి వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆర్థిక చేయూతనిచ్చారు. ప్రభుత్వం నుంచి మంజూరైన 2,50,000 రూపాయల ఎల్ ఓ సి చెక్కును జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బాధిత కుటుంబానికి బుధవారం రోజున అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజవర్గంలోని నిరుపేదలకు మెరిగైన వైద్యం అందించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.



## ప్రజా గాయకుడు అరుణోదయ
## నాగన్న ఐసీయూలో చికిత్స

సూర్యాపేట, ఏప్రిల్ 30 (భారత శక్తి ప్రతినిధి): ప్రజా గాయకుడు అరుణోదయ నాగన్న ఆరోగ్యం విసమించటంతో ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఇటీవల అనారోగ్యానికి గురైన అయిన కుటుంబ సభ్యులు అత్యవసరంగా ఆసుపత్రికి తరలించారు. ఆయన తోటి గాయకులు అభిమానులు ఆయన పాడిన పాటల గురించి ఆవేదన తోటి వారి భావాలు

పాటలే ఆయుధాలైన కాలంలో
పల్లెల గుండెలో మంటలేసిన స్వరం
అది నువ్వే —
పాటల పెద్దన్న, అరుణోదయ నాగన్న.
ఒకప్పుడు
నీ గాత్రం గాలికి అగ్నిలా పరిగెత్తేది,
విప్లవం అనే పదానికి
నువ్వే అర్థం ఇచ్చేవాడివి.
ఇప్పుడు—
ఐసీయూ నిశ్శబ్దంలో
నీ ఊపిరి మృదువైన యుద్ధం చేస్తోంది,
యంత్రాల శబ్దాల మధ్య
నీ పాటలు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి.
శరీరం నిశ్చలమైనా
స్వరాలు మాత్రం ఆగవు నాగన్నా,
నీ గాత్రం నేలలో కలిసిన విత్తనం—
మళ్లీ మొలకెత్తే అగ్నికణం.
మరణం తలుపు తట్టినా
నీ పాటలు గోడల్ని చెరిపేస్తాయి,
ఎందుకంటే
నీ జీవితం ఒక గీత కాదు—
ఒక ఉద్యమం.
నువ్వు పడుకున్నది మంచం కాదు,
చరిత్ర మడతలో ఒక విరామం మాత్రమే.
నీ కళ్లలో మళ్లీ వెలుగు పుడుతుంది,
నీ స్వరం మళ్లీ రగులుతుంది.
లేచి రావాలి నాగన్నా—
ఇంకా పాడాల్సిన పాటలు ఉన్నాయి,
ఇంకా వెలిగించాల్సిన జ్వాలలు ఉన్నాయి.



## రైతులను దోపిడి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

: **బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 ( భారత శక్తి ) : దండేపల్లి మండలం మ్యాదరిపేట్ వరి కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి సందర్శించి కట్టింగ్ లేకుండా వెంటనే వడ్లు కొనుగోలు చేసి రశీదు ఇవ్వాలని, వరి కొనుగోలు ప్రారంభం అయ్యి నెల రోజులు దాటిన ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించక పోవడంతో రైతులు అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే ఎలాంటి కట్టింగులు లేకుండా కొనుగోలు చేయాలని రఘునాథ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగవిరమణ పొందిన జిల్లా ఆర్మ్డ్ పోలీస్ అదనపు ఎస్పి ఆర్.జనార్ధన్ రెడ్డి

- * ఘనంగా వీడ్కోలు తెలిపిన పోలీసు సిబ్బంది.
- * 30 సంవత్సరాలు పోలీసు శాఖలో సేవలు అందించడం అభినందనీయం.
- * పోలీసు సిబ్బంది విరామ సమయంలో కుటుంబాలకు సమయాన్ని కేటాయించాలి:
- * అడ్మిన్ అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి




(భారత శక్తి, సూర్యాపేటజిల్లా ప్రతినిధి) ఏప్రిల్ 30: సూర్యాపేట జిల్లా ఆర్మ్డ్ పోలీస్ విభాగం అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.జనార్ధన్ రెడ్డి ఈరోజు ఉద్యోగవిరమణ పొందినారు. ఉద్యోగవిరమణ అనేది ప్రతి ఉద్యోగికి సహజం అని జిల్లా పోలీస్ అడ్మిన్ అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపినారు. ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నందు జనార్ధర్ రెడ్డి ని వారి కుటుంబ సభ్యుల, స్నేహితుల సమక్షంలో పోలీసు అధికారులు ఘనంగా సన్మానించారు. అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్ ల అధ్యక్షతన జరిగిన ఈ ఉద్యోగ విరమణ వేడుకల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది జనార్ధన్ రెడ్డి కి వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపినారు. ఈ సందర్భంగా అడ్మిన్ అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని ఉద్యోగ విరమణ కేవలం వయసుకే కానీ ఆలోచనలకి సేవలకు కాదని ఉద్యోగ విరమణ భారంగా భావించకూడదని తెలిపారు. పోలీస్ సిబ్బంది అందరూ విరామ సమయంలో వారి కుటుంబాలకు సమయం కేటాయించాలని పిల్లలను ఉన్నత స్థాయికి చేరేలా మంచి చదువులు చదివించాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందుతున్న జనార్ధన్ రెడ్డి గారు అన్ని విధాల విజయం సాధించారని కుటుంబాన్ని ఉన్నత స్థానంలో నిలిపారని అన్నారు. ఉద్యోగ విధుల నిర్వహణలో బాధ్యతగా పారదర్శకంగా ఉండేవారని ప్రతి పోలీసు అధికారికి పోలీసు సిబ్బందికి మెచ్చిన వ్యక్తుల ఉన్నారని క్రింది స్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు ఉత్తేజపరుస్తూ ఒక దిక్సూచిగా పని చేశారని కొనియాడారు. పోలీసు డిపార్ట్మెంట్ నందు 30 సం.రాల పాటు సుదీర్ఘకాలం సేవలు అందించడం గొప్పవిషయం అని, అభినందనీయం అన్నారు. ఈ ఉద్యోవిరమణ అనంతరము వారి కుటుంబ సభ్యుల అందరితో సుఖ సంతోషలతో గడపాలని అని, పోలీసు అధికారులు ఆకాంక్షించారు. డీఎస్పీలు, అడ్మినిస్ట్రేషన్ అధికారి, ఇన్స్పెక్టర్ లు, పోలీసు సంఘం అధ్యక్షులు, పోలీసు సిబ్బంది, స్నేహితులు బంధువులు మాట్లాడుతూ విధులలో అంకితభావంతో, బాధ్యతతో పని చేసేవారనీ, కష్టపడే తత్వం కలవారని, ఏడువారిని ఎప్పుడు సంతోషంగా ఉంచారు అన్నారు, పోలీసు సిబ్బందిని ఎప్పటికప్పుడు ఉత్తేజపరెచ్చేవారు, అందరినీ పలకరిస్తూ అందరికీ డాడి గా ప్రఖ్యాతి చెందారు అన్నారు. క్రిందిస్తాయి సిబ్బందికి సలహాలు సూచనలు ఇస్తూ పోలీస్ శాఖలో విలువైన సేవలు అందించాలని కొనియాడారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన అదనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగుల, ఉన్నతాధికారుల సహకారంతో, కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో విలువైన పోలీస్ సేవలను అందించానని బావోద్యోగానికి గురైయ్యారు. ప్రతి ఒక్కరూ కన్న తల్లిదండ్రులకు రుణపడి ఉండాలని, కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. చెడు అలవాట్లకు పోకుండా ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఏ ఆర్ డి ఎస్ పి నరసింహ చారి, ఏ ఓ మంజు భార్గవి, సీఐ లు రాజశేఖర్, వెంకటయ్య, శివకుమార్, ఆర్ ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, ఆర్ఎస్సైలు సురేష్, సాయిరాం, అఖిల్, కుటుంభం సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలల పునఃప్రారంభం లోపే స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్వహణలోకి రావాలి

**: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప, ఏప్రిల్ 30(భారత శక్తి) : జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటవుతున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులను పాఠశాలల పునః ప్రారంభం లోపు నిర్వహణలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్ గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలై జాతీయ స్థాయిలో అత్యుత్తమ పురస్కారంతో పాటు, ఇతర రాష్ట్రాలకు కూడా స్ఫూర్తినిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణాలను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల స్మార్ట్ కిచెన్ లద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత శుచిగా, రుచికరంగా, తాజాగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి జిల్లాలో నిర్మాణంలో ఉన్న అన్ని స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులు ఆయా మండలాల్లో వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. ఇందులో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. స్మార్ట్ కిచెన్ లో ఏర్పాటు చేసే పరికరాల కోసం టెండర్, కొనుగోలు, ఆయా పాఠశాలలకు ఫుడ్ ట్రాన్స్ పోర్టేషన్ కు అవసరమైన వాహనాలు మొదలైన అంశాలపై సమీక్షించారు. నిర్మాణం, పరికరాల ఏర్పాటు తదితర అన్ని పనులను జూన్ 1వ తేదీలోపు పూర్తి చేసి కిచెన్ షెడ్స్ ను నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా కూడా జాప్యం జరగకూడదని హెచ్చరించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను పాఠశాలల్లో వంద శాతం మంది విద్యార్థులు సద్వినియోగం. చేసుకునేలా సంతృప్తికరంగా నిర్వహణ జరగాలన్నారు. మండల గ్రామీణ స్థాయిలో మదర్స్ కమిటీలను కూడా ఏర్పాటు చేసి వారిని కూడా భాగస్వామ్యం చేయాల్సి వుందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ ఫార్మింగ్ ఏర్పాటుకు ఆయా మండలాల్లో సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. కిచెన్ గార్డెన్స్, కూరగాయల తోటల పెంపకం, కొనుగోలు సంబందిత అంశాలపై ఎపి సీఎన్ఎఫ్, డీఆర్డీఏ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ రాకేష్ చంద్రం, సిపిఓ హజరతయ్య, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, పీఆర్ ఎస్ఈ మద్దన్న, నేచురల్ ఫార్మింగ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్, హౌసింగ్ పీడి రాజరత్నం, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాసులు, డిఏవో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, ఎల్డిఎం జనార్ధనం, నెడ్ క్యాప్ జిల్లా మెనేజర్ ఎల్లారెడ్డి, విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, ఆకాంక్ష జిల్లా ప్రోగ్రామ్ యాంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో ఉత్తీర్ణత




నిజామాబాద్,ఏప్రిల్ 30(భారత శక్తి ): రాష్ట్రంలో బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆర్మూర్ మండలంలో 93. 65 ఉత్తీర్ణత శాతం వచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారులు చెప్పారు. ఆర్మూర్ లోని మోడల్ స్కూల్ కి చెందిన విద్యార్థిని కుమారి నిహారికకు 580 మార్కులు, మహాత్మ జ్యోతిబా పాఠశాలకు చెందిన విద్యార్థిని రశ్మితకు 571 మార్కులు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాల కేటగిరిలో ఇస్సాపల్లి లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన సిహెచ్ పూజకు 554 మార్కులు, జడ్పిహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ కి చెందిన శ్రీనిధి కి 548 మార్కులతో సత్తా చాటారు. ప్రైవేట్ పాఠశాల విభాగంలో విద్యాన్ అల్ఫోర్స్ హై స్కూల్ లో విద్యార్థికి 586 మార్కులు, నారాయణ హై స్కూల్ విద్యార్థికి 585 మార్కులు వచ్చాయి. ఆర్మూర్ మండలంలో మొత్తం 1920 మంది విద్యా విద్యార్థులు పరీక్ష రాయగా 1798 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.




# ప్రజా సౌకర్యాల మెరుగుకు ప్రాధాన్యం

* **బడంగ్‌పేట్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య పర్యవేక్షణ**

బడంగ్‌పేట్, ఏప్రిల్ 30 (భారత శక్తి) : ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ (సర్కిల్ 16) అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గురువారం డిప్యూటీ కమిషనర్ వి.సమ్మయ్య వివిధ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను, ప్రజా సమస్యలను సమీక్షించారు.

**మైదానంలో వసతుల పరిశీలన**

తొలుత మీర్‌పేట్ ప్రభుత్వ మైదానాన్ని సందర్శించిన ఆయన, అక్కడ క్రీడాకారులకు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. మైదానంలో ఇంకా చేపట్టాల్సిన మెరుగుదలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్రీడా ప్రాంగణాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

* **నాదర్‌గుల్‌లో డీసిల్టేషన్ పనులు**

అనంతరం నాదర్‌గుల్ ప్రాంతంలో జరుగుతున్న నాళాల పూడికతీత (డీసిల్టేషన్) పనులను తనిఖీ చేశారు. పనుల నాణ్యతలో రాజీ పడకూడదని, వర్షాకాలం దృష్ట్యా పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

**జేఎన్ఎన్‌యుఆర్ఎం భవనాల సందర్శన**

కుర్మల్‌గూడలోని జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీని సందర్శించి స్థానిక నివాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా:

* పరిశుభ్రత నిర్వహణ.
* మౌలిక సదుపాయాల కల్పన.
* తాగునీరు, డ్రైనేజీ సమస్యలు.

ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలించిన కమిషనర్, వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

* **పాల్గొన్న అధికారులు:**

ఈ పర్యటనలో డిప్యూటీ ఇంజనీర్ అభినయ్ కుమార్, ఏఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్, ఏఈలు గంగాప్రసాద్, హరీష్, ఇన్స్పెక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నయ్య ఆచూకీ కోసం చెల్లెలు ఫిర్యాదు



ఎల్బీనగర్, ఏప్రిల్ 30 (భారత శక్తి): గత డిసెంబర్ 2024లో ఇంటి నుండి చెప్పకుండా వెళ్ళిపోయిన అన్న ఆచూకీ కోసం ఒక చెల్లెలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగోజిగూడలో నివసించే సోదే విష్ణువర్ధన్ అనే వ్యక్తి ప్రైవేట్ జాబ్ చేస్తూ, తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. 18 నెలల క్రితం కన్నతల్లితో గొడవపడి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడని అతని చెల్లెలు ప్రసన్న కుమారి ఫిర్యాదు చేసిందని, పోయిన ఏడాది తన తల్లి చనిపోయిన విషయం అతనికి తెలియజేయడానికి, ఆయన స్నేహితులు ఆయన ఆఫీసులో కూడా విచారణ చేస్తే ఎలాంటి వివరాలు దొరకలేదని, ఈ విషయమై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీశైలం తెలిపారు.



# పేదవారి సొంతింటి కలను సాకారం చేయడమే బీబీఆర్ కన్స్ట్రక్షన్ ధ్యేయం

* **బొల్లిపల్లి తిరుపతి రెడ్డి**



తూప్రాన్, ఏప్రిల్ 30 (భారత శక్తి) : మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన "బీబీఆర్ (BBR) కన్స్ట్రాక్షన్ మరియు ఇంటీరియర్" కార్యాలయాన్ని గురువారం నాడు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీబీఆర్ కన్స్ట్రక్షన్ అండ్ ఇంటీరియర్ ప్రొప్రైటర్ బొల్లిపల్లి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. సామాన్యులు మరియు పేదవారి సొంతింటి కలను తక్కువ ఖర్చుతో, నాణ్యమైన ప్రమాణాలతో సాకారం చేయడమే తమ సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక ఇంటీరియర్ డిజైన్లతో భవన నిర్మాణ రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తామని ఆయన పేర్కొన్నారు. తమపై నమ్మకంతో వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. నూతనంగా తక్కువ ధరలో నాణ్యమైన కట్టడంతో కూడుకున్న ఇల్లును నిర్మించుకోవాలనేవారు తమ బీబీఆర్ కన్స్ట్రక్షన్ ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ అశోక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారితో పాటు గజ్వేల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, స్థానిక నేతలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తిరుపతి రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి

* **వసతులపై ఆరా**
* **త్రాగు నీటి సమస్య పరిష్కారిస్తానని హామీ**

సిద్దిపేట బ్యూరో,ఏప్రిల్ 30 (భారత శక్తి) : సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను వంగ రాజేశ్వర్ రెడ్డి సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. రైతులు తాగునీటి కొరతను ప్రస్తావించగా, వెంటనే స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో రైతుల్లో కొంత ఊరట కనిపిస్తోందని ఆయన అన్నారు. రైతుల పక్షాన నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని వంగ రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

* **కవితమ్మ చేతుల మీదుగా పార్టీ ప్రకటన.. 'పాంచజన్యం'తో ప్రజల్లోకి..**

# 'తెలంగాణ రక్షణ సేన'కు ఈసీ ఆమోదం



హైదరాబాద్, ఏప్రిల్ 30 (భారతశక్తి) : తెలంగాణ రాజకీయ యవనికపై సరికొత్త అధ్యాయం మొదలైంది. సామాజిక తెలంగాణే లక్ష్యంగా ఆవిర్భవించిన 'తెలంగాణ రక్షణ సేన' (TRS) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం (ECI) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు బంజారాహిల్స్‌లోని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు గురువారం అధికారిక పత్రాన్ని అందజేశారు. ఈ పరిణామం పట్ల పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి.

**కవితమ్మ ఇంటికి చేరిన అధికారిక పత్రం**

ఈ నెల 25న మేడ్చల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రక్షణ సేన' ఏర్పాటును ప్రకటించిన విషయం తెలిసిందే. పార్టీ నమోదు ప్రక్రియలో భాగంగా ఆమె కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన ఐదు పేర్లలో (తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజాశక్తి), ఈసీ మూడవ ప్రాధాన్యత కలిగిన 'తెలంగాణ రక్షణ సేన'ను ఖరారు చేసింది. టీఆర్ఎస్ (TRS) అనే సంక్షిప్త నామం తిరిగి లభించడం పట్ల నాయకులు సంబరాలు జరుపుకుంటున్నారు.

* **'పాంచజన్యం'.. ఐదు సూత్రాల భవిష్యత్తు ప్రణాళిక**

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఈ పార్టీ ఐదు ప్రధాన హామీలతో (పాంచజన్యం) ప్రజల ముందుకు వెళ్లనుందని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, మేడ్చల్ జిల్లా నేత రామిడి వెంకట్ రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి తెలిపారు. ఆ ఐదు ప్రధానాంశాలు ఇవే:

1. ఉచిత విద్య: కేజీ నుంచి పీజీ వరకు ప్రతి విద్యార్థికి అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉచిత విద్య.
2. అందరికీ ఆరోగ్యం: పేదలందరికీ కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందించడం.
3. రైతు సంక్షేమం:సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ మరియు గిట్టుబాటు ధరతో పూర్తిస్థాయి మద్దతు.
4. ఉపాధి కల్పన:సింగిల్ నోటిఫికేషన్ ద్వారా 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ. యువత స్వయం ఉపాధి కోసం రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణ సదుపాయం.
5. సమాన ప్రాధాన్యత: రాజకీయ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం మరియు సమాన వాటా.

"తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు, వారి గొంతుకకు దక్కిన తొలి విజయం ఇది. విధి కల్వకుంట్ల కవిత వైపు నిలిచి, తిరిగి 'టీఆర్ఎస్' పేరును ఖరారు చేయడం శుభపరిణామం. ఈ పార్టీ రాష్ట్ర భవిష్యత్తును పునర్నిర్మిస్తుంది."

**కప్పాటి పాండురంగా రెడ్డి, టీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు.**

తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుతూనే, సామాజిక న్యాయం దిశగా పార్టీ అడుగులు వేస్తుందని, అతి త్వరలోనే పూర్తిస్థాయి కార్యచరణను ప్రకటించనున్నట్లు నాయకులు స్పష్టం చేశారు.


# స్టార్టప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్షిప్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



కడప, ఏప్రిల్ 30(భారత శక్తి ) : గురువారం కడప ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో రాయలసీమకే తలమానికంగా రూపుదిద్దుకుంటున్న పి4 "స్టార్టప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్షిప్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. జిల్లాలో ఒక ప్రత్యేక నైపుణ్య నిధిగా, అధునాతన సంకేతికతతో రూపుదిద్దుకుంటున్న స్టార్టప్ కడప భవన నిర్మాణ పనులను నాణ్యతలో ఎలాంటి రాజీలేకుండా, వేగవంతంగా నిర్ణీత సమయంలోగా పూర్తిచేయాలని సంబందిత ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట కేఎంసి కమిషనర్ రాకేష్ చంద్రం, హౌసింగ్ పీడి రాజారత్నం, ఏపీఎస్పిడిసిఎల్ ఎస్.ఈ. శ్రీనివాసులు, కాంట్రాక్టు ఏజెన్సీలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లో మే 22 నుండి 24 వరకు జరుగు రైతు పండుగ కార్యక్రమానికి సన్నద్ధం కండి

* **జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



వైయస్సార్ కడప,ఏప్రిల్ 30(భారత శక్తి ): రైతులకు సాంకేతికతతో పంట దిగుబడి మార్కెట్ కు అనుసంధానం చేసే అంశాలపై అవగాహన కల్పించేందుకు మే 22 నుంచి 24 వరకు వైఎస్ఆర్ కడప జిల్లాలో నిర్వహించనున్న రైతు పండుగ కార్యక్రమానికి సంబంధిత అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ లోని బోర్డ్ రూమ్ నందు రైతు పండుగ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు పండుగ కార్యక్రమాన్ని జిల్లాలో అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించేందుకు అవసరమైన సన్నాహ ఏర్పాట్లు ప్రారంభించాలన్నారు. వ్యవసాయ,ఉద్యానవన, పశు సంవర్ధక,పట్టు పరిశ్రమ, మత్స్య శాఖ అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించు కొని రైతులు అధిక దిగుబడి సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన, నాబార్డు, ఇతర బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందే సౌకర్యం,పండించిన పంటను మార్కెటింగ్ చేసే అంశాలపై అవగాహన,ఇలా రైతు పండుగ కార్యక్రమం రైతులకు మరింత లాభదాయకంగా మారేలా కార్యాచరణ ప్రణాళిక ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు..



# బాధిత కుటుంబానికి ఎల్ వోసీ అందజేత

నిజామాబాద్,ఏప్రిల్ 30(భారత శక్తి): ఆర్మూర్ మండలం పిప్రికి చెందిన అసపురం రజిత అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షల ఎల్ వోసీని అందజేశారు. ఆర్మూర్ లోని పీవీఆర్ భవన్ లో జరిగిన ఓ కార్యక్రమంలో బాధిత కుటుంబానికి ఎల్ వోసీ కాపీని అందించారు. ప్రభుత్వానికి, ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దామోదర్, పిప్రి నాయకులు జీవన్ రెడ్డి, పెద్ద గంగారెడ్డి, నర్సారెడ్డి, తదితర పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

కడప, ఏప్రిల్ 30 (భారత శక్తి ): గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ భవన సముదాయంలోని ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ల పరిస్థితిని తనిఖీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటపతి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఈ.శ్రీకాంత్ రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మే 1 నుంచి మారనున్న కీలక నిబంధనలు

- మే 1 నుంచి అమల్లోకి రానున్న పలు ఆర్థిక, నియంత్రణ పరమైన మార్పులు
- ఎల్‌పీజీ సిలిండర్ ధరలు, బుకింగ్, డెలివరీ నిబంధనల్లో కీలక మార్పులు
- ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై పెరగనున్న లేట్ పేమెంట్ ఫీజులు.. మారనున్న ఫీజు మినహాయింపు రూల్స్
- ఆన్‌లైన్ గేమింగ్ కోసం కఠినమైన కొత్త చట్టం, ప్రత్యేక అథారిటీ ఏర్పాటు
- సీఎన్‌జీ-పీఎన్‌జీ ధరల సవరణకు అవకాశం

ఢిల్లీ, ఏప్రిల్ 30 (భారత శక్తి ): మే 1, శుక్రవారం నుంచి కొత్త నెల ప్రారంభం కాబోతోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా సామాన్యుడి దైనందిన జీవితం, ఆర్థిక లావాదేవీలపై ప్రత్యక్ష ప్రభావం చూపే పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. గ్యాస్ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు చార్జీల వరకు, ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణల వరకు అనేక రంగాల్లో కొత్త నిబంధనలు అమలు కానున్నాయి. ఈ మార్పుల గురించి ముందుగా తెలుసుకోవడం బెటర్.

**ఎల్‌పీజీ సిలిండర్: ధర, బుకింగ్, డెలివరీలో మార్పులు**

ప్రతి నెలా మొదటి తేదీన చమురు మార్కెటింగ్ సంస్థలు గ్యాస్ సిలిండర్ ధరలను సవరిస్తాయి. ఈ క్రమంలో మే 1న గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ల ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉంది. దీని ప్రభావం సాధారణ కుటుంబాల నుంచి హోటళ్లు, రెస్టారెంట్ల వరకు అందరిపైనా పడుతుంది.

*** గ్యాస్ బుకింగ్ లో కూడా కొత్త నిబంధనలు**

ఇకపై గ్యాస్ బుకింగ్ విషయంలో కూడా కొత్త నిబంధనలు రానున్నాయి. ఒకసారి సిలిండర్ బుక్ చేశాక, మళ్లీ బుక్ చేయడానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల నిరీక్షణ కాలాన్ని తప్పనిసరి చేసే అవకాశం ఉంది. దీంతోపాటు డెలివరీ ప్రక్రియలో భద్రతను పెంచేందుకు డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) విధానాన్ని తప్పనిసరి చేస్తున్నారు. ఇకపై సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారుడు తమ ఫోన్‌కు వచ్చిన ఓటీపీని డెలివరీ ఏజెంట్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే, ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులు సబ్సిడీ ప్రయోజనాలు కొనసాగాలంటే, ఆధార్ ఆధారిత ఈకేవైసీని తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి. లేనిపక్షంలో సబ్సిడీ నిలిచిపోయే ప్రమాదం ఉంది.

**ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు చార్జీలలో మార్పులు**

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ రేపటి నుంచి తమ క్రెడిట్ కార్డు నిబంధనలను సవరిస్తోంది. బ్యాంకు అధికారిక వెబ్‌సైట్ ప్రకారం లేట్ పేమెంట్ ఫీజులు, వార్షిక ఫీజు మినహాయింపు షరతుల్లో మార్పులు చేసింది. రూ. 100 నుంచి రూ. 500 మధ్య బకాయిలపై లేట్ పేమెంట్ చార్జి రూ. 100, రూ. 500 నుంచి రూ. 1,000 మధ్య బకాయిలపై రూ. 500 వరకు వసూలు చేయనున్నారు. కొన్ని కార్డులపై గతంలో ఏడాదికి రూ. 50,000 ఖర్చు చేస్తే లభించే వార్షిక ఫీజు మినహాయింపు పొందాలంటే, ఇకపై రూ. 1 లక్ష వరకు ఖర్చు చేయాల్సి రావచ్చు.

**సీఎన్‌జీ-పీఎన్‌జీ ధరల సవరణ**

ఎల్‌పీజీ మాదిరిగానే కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) ధరలను కూడా నెల మొదటి రోజున సవరిస్తారు. ఈ ధరల పెంపు రవాణా ఖర్చులతో పాటు గృహ బడ్జెట్‌లపై కూడా ప్రభావం చూపుతుంది.

## సీఎం రేవంత్ రెడ్డితో
# డీజీపీ సీవీ ఆనంద్ భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 30 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎంను కలిశారు. తనపై నమ్మకం ఉంచి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రస్తుత భద్రతా పరిస్థితులపై చర్చించారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో, శాంతిభద్రతలను కాపాడటంలో రాజీ పడకుండా పనిచేస్తానని ఆయన సీఎంకు హామీ ఇచ్చారు. మరోవైపు, ఈరోజు డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. చీఫ్ సెక్రటరీకి సమాన హోదాలో ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. ప్రతి నెల ఆయన రూ. 2.25 లక్షల వేతనం అందుకుంటారు. ప్రత్యేక కార్యాలయంతో పాటు ఎన్నో సదుపాయాలు ఆయనకు ఉంటాయి.

## అమెరికాతో పాకిస్థాన్
# డబుల్ గేమ్?.. ఇరాన్‌కు అండగా కీలక నిర్ణయం!

ఇస్లామాబాద్/వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరు దేశాల మధ్య శాంతి కోసం మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ తీసుకున్న ఒక నిర్ణయం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇరాన్‌తో వాణిజ్యం కోసం తమ భూభాగం మీదుగా ఆరు మార్గాలను తెరుస్తున్నట్లు పాక్ అధికారికంగా ప్రకటించింది. ఈ చర్య, ఇరాన్‌పై అమెరికా అమలు చేస్తున్న కఠిన ఆర్థిక ఆంక్షలను నీరుగార్చడమేనని, పాకిస్థాన్ "డబుల్ గేమ్" ఆడుతూ అమెరికాకు వెన్నుపోటు పొడిచిందని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హర్మ్యూజ్ జలసంధి మీదుగా ఇరాన్ సముద్ర వాణిజ్యాన్ని దిగ్బంధించి, ఆ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలన్నది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యూహం. దీనిని "గరిష్ఠ ఆర్థిక ఒత్తిడి" (max imum economic pressure) విధానంగా ఆయన అభివర్ణిస్తున్నారు. అయితే, పాకిస్థాన్ తాజా నిర్ణయంతో ఇరాన్ తన వాణిజ్యాన్ని, ముఖ్యంగా రష్యా, చైనాలతో లావాదేవీలను ఈ భూమార్గాలు ద్వారా నిరాటంకంగా కొనసాగించే అవకాశం లభించింది. దీంతో ట్రంప్ వ్యూహానికి పెద్ద గండి పడినట్లయింది. ఈ పరిణామంపై అమెరికా జాతీయ భద్రతా నిపుణుడు డెరెక్ జె గ్రాస్‌మన్ తీవ్రంగా స్పందించారు. "ట్రంప్ ప్రభుత్వానికి ఇది కొత్త సమస్య. మీకు మిత్రుడైన పాకిస్థాన్, ఇరాన్‌కు ఆరు భూమార్గాలను తెరవడం హర్మ్యూజ్ జలసంధిలో మీరు ఏర్పాటు చేసిన దిగ్బంధనాన్ని బలహీనపరిచింది. అమెరికా ఒత్తిడిని తట్టుకోవడానికి ఇది ఇరాన్‌కు సహాయపడుతుంది. ఇస్లామాబాద్ మరోసారి అమెరికాతో డబుల్ గేమ్ ఆడింది" అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. డాన్ పత్రిక కథనం ప్రకారం ఇప్పటికే పాక్ ఓడరేవుల్లో ఇరాన్ వెళ్లాల్సిన సుమారు 3,000 కార్గో కంటైనర్లు నిలిచిపోయాయి. తాజా నిర్ణయంతో అవన్నీ ఈ భూమార్గాల ద్వారా ఇరాన్‌కు చేరనున్నాయి. కేవలం అమెరికా మాత్రమే కాదు, పాకిస్థాన్ మధ్యవర్తిత్వ పాత్రపై ఇతర దేశాలు కూడా సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. పాకిస్థాన్ నమ్మదగిన మధ్యవర్తి కాదని భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఆసక్తికరంగా పాకిస్థాన్ సహాయం పొందుతున్న ఇరాన్ కూడా దాని నిష్పాక్షికతను శంకించడం గమనార్హం. పాక్ తమకు మంచి మిత్రుడే అయినప్పటికీ, అది అమెరికా ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, అందువల్ల సరైన మధ్యవర్తి కాదని ఇరాన్ జాతీయ భద్రతా కమిషన్ ప్రతినిధి ఇబ్రహీం రెజాయీ పేర్కొన్నారు. ఈ పరిణామాలతో పాకిస్థాన్ దౌత్యపరమైన విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది.

## తెలుగు అకాడమీ విభజన
# మా వాటా మాకు ఇవ్వండి!

హైదరాబాద్, ఏప్రిల్ 30 (భారత శక్తి): రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ఆస్తుల పంపకాల వివాదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా తెలుగు అకాడమీకి సంబంధించిన నిధుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర విభజన ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీకి రావాల్సిన వాటా నిధులను తెలంగాణ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం వాటిని బేఖాతరు చేస్తోందని ఆయన ఆరోపించారు. నిధుల కొరత కారణంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ కార్యకలాపాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని విల్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, సమగ్ర శిక్షా అధికారులకు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. మరోవైపు ఏపీ ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల ముద్రణకు సంబంధించి రావాల్సిన రూ.50 కోట్ల బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర విభజన తర్వాత తెలుగు అకాడమీ ఆస్తులు, డిపాజిట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య 58:42 నిష్పత్తిలో పంపిణీ చేయాలని గతంలోనే ఒప్పందం కుదిరింది. దీనిపై సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకుని, ఏపీ వాటాను 6 శాతం వడ్డీతో సహా చెల్లించాలని 2021 హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ తెలంగాణ నుంచి స్పందన లేదని ఏపీ అకాడమీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా విల్సన్ ఏపీ ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశారు. తమిళనాడు తరహాలో ఏపీలో వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, అకాడమీ భవనం కోసం ప్రభుత్వం భూమి కేటాయిస్తే రూ.15 కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌కు కేబినెట్ హోదా కల్పించాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా అకాడమీ పుస్తకాలను కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని, అకాడమీలో ఖాళీగా ఉన్న 13 పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# అమెరికా సైన్యానికి ఇరాన్ హ్యాకర్ల షాక్!

వాషింగ్టన్/దుబాయ్ : ఇరాన్‌తో సంబంధాలున్న ఓ హ్యాకర్ల బృందం అమెరికాకు గట్టి షాక్ ఇచ్చింది. పర్షియన్ గల్ఫ్‌లో మోహరించిన 2,379 మంది అమెరికా మెరైన్స్ వ్యక్తిగత వివరాలను లీక్ చేసినట్లు 'హండాలా' అనే సైబర్ గ్రూప్ ప్రకటించింది. తమ టెలిగ్రామ్ ఛానెల్‌లో సైనికుల పేర్లు, ఇతర వివరాలను మంగళవారం విడుదల చేసినట్లు తెలిపింది. తమ నిఘా సామర్థ్యాలను చాటుకునేందుకే ఈ లీక్‌కు పాల్పడినట్లు హ్యాకర్లు పేర్కొన్నారని వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. అంతటితో ఆగకుండా ఆ సైనికుల వాట్సాప్‌కు "మేం మిమ్మల్ని గమనిస్తున్నాం, మిమ్మల్ని లక్ష్యంగా చేసుకోవచ్చు" అంటూ బెదిరింపు సందేశాలు పంపినట్లు ఇరాక్‌కు చెందిన షఫాక్ న్యూస్ రిపోర్ట్ చేసింది. సైనికుల కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి చిరునామాలు, వారి దినచర్యలు, కదలికల సమాచారం కూడా తమ వద్ద ఉందని హ్యాకర్ల బృందం హెచ్చరించింది. ఈ ఘటనపై అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ తీవ్రంగా స్పందించింది. సైనికుల వివరాలు బహిర్గతం కావడం భద్రతకు పెను ముప్పు అని భావిస్తూ ఈ సైబర్ దాడిపై ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించింది. డేటా ఎలా చోరీకి గురైందనే దానిపై అధికారులు దృష్టి సారించారు. ఇదే హండాలా గ్రూప్ గత నెలలో ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ వ్యక్తిగత ఈమెయిల్‌ను హ్యాక్ చేసినట్లు ప్రకటించుకోవడం గమనార్హం. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ సైబర్ దాడి జరగడం ప్రాధాన్యంను సంతరించుకుంది. ఈ ఘటనతో అంతర్జాతీయ ఘర్షణల్లో సైబర్ దాడులు ఎంత కీలక పాత్ర పోషిస్తున్నాయో మరోసారి స్పష్టమైంది.

# మైక్రోఫైనాన్స్ కేసులో సంచలనం... మంగ్లీ సోదరుడి ఖాతాకు డబ్బులు!

హైదరాబాద్, ఏప్రిల్ 30 (భారత శక్తి): గాయని మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ కేసులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగ్లీ సోదరుడు శివచౌహాన్ బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలించగా, మూడుసార్లు డబ్బులు వచ్చినట్లు గుర్తించారు. రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి శివ అకౌంట్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు వచ్చాయని తెలిపారు. దీనితో రమావత్ మధు బ్యాంకు ఖాతాను పోలీసులు జప్తు చేశారు. మధు, హిమకాంత్ రెడ్డి, శివ చౌహాన్‌ల బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలని బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు. మైక్రో ఫైనాన్స్ పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంగ్లీ, ఆమె సోదరుడు, మరికొంతమంది కలిసి కోట్లాది రూపాయలు మోసం చేశారని సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై తాను మంగ్లీని సంప్రదించే ప్రయత్నం చేయగా ఆమె బెదిరింపులకు పాల్పడిందని చెబుతూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో మంగ్లీ, ఆమె సోదరుడితో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, తన పేరును ఉపయోగించుకుని సుబ్బారావు ప్రాచుర్యం పొందాలని చూస్తున్నారని ఆరోపిస్తూ మంగ్లీ కూడా ఫిర్యాదు చేశారు.

# ‘టీఆర్‌ఎస్’ నాకు రాసిపెట్టి ఉందేమో: కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 30 (భారత శక్తి): ‘టీఆర్‌ఎస్ పార్టీ నాకు రాసి ఉందేమో’ అని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ ‘టీఆర్‌ఎస్’కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసింది. అయితే తెలంగాణ రాష్ట్ర సేనకు బదులు తెలంగాణ రక్షణ సేన పేరును ఆమోదించింది. టీఆర్‌ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖను అందజేశారు. ఈ నేపథ్యంలో, ‘టీఆర్‌ఎస్’కు ఆమోదం తెలపడంపై కవిత ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. తొలుత తాను సూచించిన తెలంగాణ రాష్ట్ర సేనకు బదులు తెలంగాణ రక్షణ సేనకు ఈసీ ఆమోదం తెలిపింది. అయితే రెండింటి సంక్షిప్త నామాలు ‘టీఆర్‌ఎస్’ కావడంతో కవిత హర్షం వ్యక్తం చేశారు. "తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్)కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందని తెలంగాణ సమాజానికి తెలియజేస్తున్నాను. టీఆర్‌ఎస్‌కు ఆమోదం లభించడం సంతోషంగా ఉంది. రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం నేను చేసిన కృషిని కొనసాగిస్తూ, ఇక ముందు కూడా తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తానని తెలియజేస్తున్నాను" అని కవిత పేర్కొన్నారు. జనవరి 2026లో జాతీయ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నామని, అందులో మూడవ ప్రాధాన్యత గా మేము ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించడం కేవలం యాదృచ్ఛికమని పేర్కొన్నారు. ‘టీఆర్‌ఎస్’ నాకు రాసి పెట్టి ఉందేమో అని పేర్కొన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 30 (భారత శక్తి): భానుడి భగభగలతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది. ఈ వాతావరణ మార్పుల వల్ల గురువారం నుంచి శనివారం వరకు రెండు

# ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు వర్ష సూచన


రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఏపీలోని దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన పరిస్థితులు ఉండబోతున్నాయని వెల్లడించింది. వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం కూడా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తెలంగాణ విషయానికి వస్తే... హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా ప్రకారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజులు అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అయితే, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మాత్రం పెద్దగా మార్పు ఉండకపోవచ్చని, ఎండ తీవ్రత కొనసాగుతూనే మధ్యమధ్యలో వానలు పడతాయని అధికారులు తెలిపారు.

# మోదీ టూర్ అప్‌డేట్స్: కిషన్ రెడ్డి కీలక ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 30 (భారత శక్తి): తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ మే 10వ తేదీన తెలంగాణలో పర్యటించనున్నట్లు ఆయన మీడియాకు తెలియజేశారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారిగా తెలంగాణకు రానుండటంతో... ఈ పర్యటనపై అటు రాజకీయంగా, ఇటు పాలనాపరంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో రైల్వే వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు.

# పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో షైన్ విద్యార్థుల ప్రభంజనం

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి) ఏప్రిల్ 30: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో షైన్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రేణి విద్యా సంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ వెల్లడించారు. 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులు ,వారి ఉన్నతి కి కృషి చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు .అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో మొత్తం 600 మార్కుల గాను ఏ .అక్షర 588 మార్కులు సాధించగా ,ఎల్. రేవంత్ ,ఎం.డి .ఆఫ్రోజ్ 586 మార్కులు ,సమీరా నయీమ్ 585 మార్కులు ,వెలుదండి సీమా ,జీ .సంహిత ,కే. సుమిత్ కు 584 మార్కులు ,టి హాసినీ, ఏ . ప్రశాంతి, ఏ .సుశాంత్, సి.హెచ్ సిరి లకు 583 మార్కులు సాధించారు. వీ జహ్నవి ,




మార్క శ్రీధస్ 582 మార్కులు, ఏ. హర్షిణీ 581 పి. యతీష్ , పి.హర్షిత మార్కులు 580 సాధించినట్లు షైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ వెల్లడించారు. 85 శాతం పైగా విద్యార్థులు మార్కులు లు సాధించడం గర్వకారణమైన కొనియాడారు .ఐఐటి ఫౌండేషన్ , నీట్ తో పాటు పదవ తరగతి పరీక్షలకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందన్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో కూడా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని అధిరోహించారని చెప్పారు .విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ ,కరస్పాండెంట్ మూగల రమ, షైన్ పబ్లిక్ స్కూల్ ఎర్రగట్టు బ్రాంచ్ సెక్రటరీ జక్కుల శ్రీనివాస్ యాదవ్, ఐఐటి కోఆర్డినేటర్ మూగల రమేష్ యాదవ్, ప్రిన్సిపల్స్ ఈ. విశాల్, కే దినేష్ రాజకుమార్ ,కవిత ప్రగతి రెడ్డి ,సవిత ,మానస , కాలేజీ ప్రిన్సిపల్ రాజు గౌడ్ ,పి .శ్రీనివాస్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శిథిలావస్థ భవనాలపై 'హైడ్రా' నజర్

* **ప్రమాదకర కట్టడాలపై సమాచారానికి హెల్ప్‌లైన్ నంబరు విడుదల**

హైదరాబాద్: ఏప్రిల్ 30 (భారత శక్తి) : నగరంలో జనసంచారం ఉన్న ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన భవనాల వల్ల ప్రాణనష్టం జరగకుండా 'హైడ్రా' (HYDRAA) ముందస్తు చర్యలు చేపట్టింది. కూలడానికి సిద్ధంగా ఉన్న పాత కట్టడాలను గుర్తించి, వాటిని సురక్షితంగా తొలగించడం ద్వారా ప్రమాదాలను నివారించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రజలు తమ పరిసరాల్లోని ప్రమాదకర భవనాల గురించి సమాచారం అందించాలని కోరుతూ *9000113667* హెల్ప్‌లైన్ నంబరును ప్రకటించింది.

**అప్రమత్తతే రక్షణ**

ఇటీవల బెంగళూరులోని శివాజీనగర్‌లో కురిసిన భారీ వర్షానికి ఓ ప్రహరీ గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనను హైడ్రా ఈ సందర్భంగా ప్రస్తావించింది. హైదరాబాద్‌లోనూ గతంలో ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో, అకాల వర్షాల వల్ల పాత భవనాలు కూలే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

* కేవలం వర్షాకాలంలోనే కాకుండా, ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
* మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి ఇప్పటికే సమాచారం సేకరిస్తున్నామని, ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని కోరింది.

**వివరాలు పంపాల్సిన విధానం**

* ప్రమాదకరంగా ఉన్న భవనం లేదా కట్టడం ఏ ప్రాంతంలో ఉందో తెలుపుతూ, దానికి సంబంధించిన ఫోటో, కరెంట్ లొకేషన్‌ను పై నంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించింది.

**గోప్యత పాటిస్తాం:**


* శిథిలావస్థలో ఉన్న కట్టడాల గురించి సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని హైడ్రా స్పష్టం చేసింది. సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది.

# పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం

ఎల్బీనగర్, ఏప్రిల్ 30 (భారత శక్తి): మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులను సిపి ఆదేశాలతో సన్మానించారు. వారు కె. కరుణాకర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్, హెచ్.బండయ్య, సబ్ ఇన్స్పెక్టర్, సరూర్నగర్ పోలీస్ స్టేషన్,ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్ లో పనిచేస్తున్న బి. కిష్టయ్య,రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు పదవి విరమణ పొందిన వారిని సన్మానం చేసిన సందర్భంగా మల్కాజ్గిరి అడ్మిన్ డీసీపీ శివ కుమార్ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎంతో కాలం పాటు పోలీసు శాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు అభినందించారు.ఈ కార్యక్రమంలో సీఏఓ అడ్మిన్ శ్రీనివాస్,చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్,అశోక్ రెడ్డి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్. భద్రారెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ నాయుడు, కో ఆపరేటివ్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, బాలరాజు ట్రెజరర్,డైరెక్టర్స్ సువర్ణ, వల రాజు తదితరులు పాల్గొన్నారు.






Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.